

జిల్లా ఓటర్లు
16,23,149
2024 ఎన్నికల తుది జాబితా



నువ్వు కావాలయ్యా.. నువ్వు రావాలయ్యా: కాకినాడ రూరల్‌లో పవన్ రోడ్ షో



అభిమాన పవనాలు : కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో సభకు హాజరైన జనం



రాత్రయినా తరగని అభిమానం: సామర్లకోటలో సభకు హాజరైన జనం

సమస్యలివే సార్ : పవన్‌తో మాట్లాడుతున్న పిల్లి సత్యనారాయణమూర్తి

మా గుండెల నిండా నువ్వే పవనన్నా...

కాకినాడ రూరల్ రోడ్ షోలో పవన్ అభివాదం

జన కెరటం..



కూటమికే ఓటేయండి : అభ్యర్థులు పంతం నానాజీ, ఉదయ్ శ్రీనివాస్‌లతో కలిసి పవన్ అభివాదం





తమ్మవరం రైతులకు జగన్ మోసంపై సభలో ఫ్లెక్సీ

గుర్తు పెట్టుకోండి.. మరచిపోవద్దు : పెద్దాపురంలో పవన్‌తో కలిసి గుర్తులను చూపుతున్న అభ్యర్థులు ఉదయ్‌శ్రీనివాస్, నిమ్మకాయల చినరాజప్ప

- పవన్ వారాహియాత్రకు జన సునామీ
- కాకినాడ రూరల్, సామర్లకోటల్లో సభలు
- వైసీపీ నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- కూటమిని గెలిపించాలని విన్నపం
- బాధితులకు న్యాయం చేస్తామని హామీ

సర్పవరం జంక్షన్/కాకినాడ రూరల్/పెద్దాపురం/సామర్లకోట, ఏప్రిల్ 27: 'రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన అంతం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం సొంత పార్టీ ప్రయోజనాలనే పణంగా పెట్టి, అనుభవం ఉన్న చంద్రబాబుకు మద్దతు ఇచ్చినవాడిని.. ఏ ఒక్క కులాలకో పరిమితం కాను. అన్ని కులాల ప్రయోజనాల కోసం పాటుపడతా. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి గెలిపించాలి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోరారు. కాకినాడ రూరల్ ఇంద్రపాలెం ముసలమ్మతల్లి ఆలయం వద్ద కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు(నానాజీ)ఆధ్వర్యంలో శనివారం రాత్రి వారాహి యాత్ర నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టేబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలపై తీవ్ర విమర్శలు చేశారు. డొక్కు స్కూటర్‌తో సమాచారం కావాలంటే మా ఇంటికి వచ్చే కన్నబాబు అక్రమాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడి రూ.వెయ్యి కోట్ల అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆస్తి తగాదా పేరు చెప్పి యువ డాక్టర్ ఆత్మహత్యకు కారణమైన దుర్మార్గుడు అని ఆరోపించారు.వాకలపూడిలో 20 మందికి చెందిన 4.86 ఎకరాల భూమిని కడప జిల్లాకు చెందిన రెడ్లు కొట్టేయడంలో సహకరించారన్నారు.తమ్మవరం రైతుల నుంచి ఏపీఐఐసీ సేకరించిన 298 ఎకరాల భూమిని వెనక్కి ఇప్పిస్తానని హామీ ఇచ్చి సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు రైతులను మోసగించారన్నారు. కన్నబాబు కమిషన్లు తీసుకుంటూ దందాలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం కమీషన్ కోసం కొంగోడు బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకున్న ఘనుడన్నారు. సూర్యారావుపేటలో మత్స్యకారుల ఇళ్లను ఖాళీ చేయించి తిరిగి స్థలాలివ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్ర మాలు మర్చిపోలేదన్నారు. రాష్ట్ర శ్రేయస్సు, యువత భవిష్యత్తు కోసం గాజుగ్లాసు గుర్తులపై రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా పంతం నానాజీ, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. టీడీపీకి చెందిన సీనియర్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను పవన్ ప్రశంసించారు.సభలో ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు,కె.బాబీ, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్ బొండా సూర్యారావు, కాకరపల్లి చలపతి, రాందేవు సీతయ్యదొర, పెంకే శ్రీనివాస్‌బాబా పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలన.. ఆరు పరిశ్రమల మూత

శత సంవత్సరాల చరిత్ర గల సామర్లకోట డెక్కన్ షుగర్ ఫ్యాక్టరీ, సగ్గుబియ్యం పరిశ్రమ, నాలుగు సహకార చక్కెర కర్మాగారాలు ఐదేళ్ల వైసీపీ పాలనలోనే మూతపడ్డాయని పవన్ కల్యాణ్ అన్నారు. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట పట్టణ రింగ్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాజానగరం నుంచి కాకినాడ వరకూ ఉన్న ఏడీబీ రోడ్డులో స్వయంగా ప్రయాణించి ప్రజల కష్టాలు తెలుసుకున్నానన్నారు.రానున్న కూటమి ప్రభుత్వంలో రోడ్లను అభివృద్ధి చేసే బాధ్యతను జనసేన తరఫున తాను స్వీకరిస్తానన్నారు. స్థానికంగా 100 పడకల ఆస్పత్రిని నిర్మించి మెరుగైన వైద్యం అందిస్తానన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు కలిసి 600 ఎకరాల రామేశం మెట్టను పూర్తిగా నేలమట్టం చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ప్రతి వైసీపీ నాయకుడిని రామేశంమెట్టలో మోకాలిపై నడిపిస్తామంటూ హెచ్చరించారు.పెద్దాపురం నియోజకవర్గంలో 55 ఎకరాల్లో 20,040 మందికి స్థలాలిస్తే వాటిలో 1,019 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు గోదావరి జలాలను అందిస్తామని జగన్ ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ఎస్సీలు తమ పథకాలను ఎందుకు నిలిపివేశారో నిలదీయాలన్నారు. ఎమ్మెల్సీ దళిత డ్రైవర్‌ను హతమార్చి డోర్ డెలివరీ చేస్తే దళితులు ఎందుకు వైసీపీకి ఓటు వేయాలి అని సునీల్‌ను ప్రశ్నించారు. ఓటమి పొందే పార్టీలోకి మారడం సునీల్ నైజమన్నారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం..

కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని యువతకు ఉపాధి కల్పిస్తా. కాకినాడ పోర్టును అభివృద్ధి చేస్తా. ఏడీబీ రహదారిని గుంతలమయంగా మార్చేసిన ఘనత వైసీపీదే. ఫుడ్ పార్కును గాలికొదిలేశారు. ఏఒక్క పరిశ్రమా రాలేదు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తెచ్చి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా.

ఇళ్ల పట్టాల పేరుతో పేదలకు మోసం

కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ

కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వంలో నకిలీ ఇళ్లపట్టాలిచ్చారు. స్వామినగర్‌లోఇళ్లపట్టాల పేరుతో పేదలను మోసగించారు. జయలక్ష్మి సహకార సొసైటీ స్కామ్‌లో వైసీపీ నాయకుల పాత్ర ఉంది. రూరల్‌లోని గ్రామాల్లో వైద్యం మీద ప్రత్యేక దృష్టి పెడతాం. కాకినాడ బీచ్‌ను సుందరంగా చేస్తాం.

రాష్ట్రం కోసం ఆలోచించే కూటమి

పెద్దాపురం టీడీపీ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంది. ఇది గుర్తించి కూటమిగా ఏర్పడాలని భావించిన వ్యక్తి పవన్. అందరినీ ఒప్పించి కూటమి ఏర్పాటు చేశారు. 2019లో నేను విజయం సాధించినా నన్ను పనిచేయనివ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక్క రూపాయి ఇవ్వకుండా మోసాలు చేసి సంపద దోచుకున్నారు.

పాతపాటే!

- కూటమి సూపర్ సిక్స్ ముందు తుస్సుమన్న వైసీపీ మేనిఫెస్టో
- విస్తుబోయిన నేతలు.. డీలాపడిన సొంత పార్టీ శ్రేణులు..
- ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతకు జగన్ మొండిచెయ్యి
- బీసీ, ముస్లిం, మైనారిటీల రిజర్వేషన్ల ఊసూ లేదు
- పోలవరానికి మరో అయిదేళ్లూ కావాలట
- పింఛనుదారులకు గత ఎన్నికల నాటి తంతే ఈసారీ
- 2028లో రూ.250, 2029లో రూ.250 పెంచుతామని మెలిక
- ఇప్పటికే రూ.4 వేలు పింఛను ఇస్తామని టీడీపీ కూటమి ప్రకటన
- దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని మరో అద్భుత వరం
- మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తామన్న చంద్రబాబు
- బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు.. ప్రత్యేక రక్షణ చట్టం
- పథకాలతో కూటమిలో జోష్.. మేనిఫెస్టోతో వైసీపీ కేడర్ డీలా



ఈసారి ఎన్నికల వైసీపీ మేనిఫెస్టో తుస్సుమంది. కొద్దిరోజులుగా జగన్ ప్రకటించే మేనిఫెస్టోపై రకరకాల ఊహాగానాలను ఆ పార్టీ నేతలు ప్రచారంలోకి తెచ్చారు. అభ్యర్థుల ప్రచార సమయంలో కూడా ఓటర్లకు పింఛన్లు భారీగా పెంచుతామని, యువతకు ఉద్యోగాలంటూ నేరుగా చెబుతూ వచ్చారు. తీరా మేనిఫెస్టో విడుదలైన తర్వాత ఆ పార్టీ వారికే మింగుడుపడడం లేదు. గత ఎన్నికల్లో మాదిరే ఈసారీ 'పెంచుకుంటూ పోతాం' అనే పల్లవినే జగన్ అందుకోవడం విశేషం. గత ఎన్నికల సమయంలో పింఛన్ల ప్రకటనలో కూడా ఇదే గందరగోళం సృష్టించారు. పెంచుకుంటూ పోతామనే దానికి అర్థం ఏమిటో పింఛనుదార్లకు తర్వాతగానీ బోధపడలేదు. ఈసారీ అదే పల్లవి అందుకోవడంతో గత హామీ అమలును గుర్తుచేస్తున్నారు. కొత్తగా వైసీపీ మేనిఫెస్టోలో ఏ పథకాలు లేకపోగా, టీడీపీ ఏడాదికాలం కింద ప్రకటించిన సూపర్ సిక్స్ పేరిట జనం నోళ్లలో నానుతున్న పథకాలతో పోల్చి మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా పింఛన్ల పెంపు, 20 లక్షల ఉద్యోగాల కల్పన, మహాశక్తి పథకాలపై చర్చ జరుగుతోంది.



(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఈసారి మేనిఫెస్టో రూపకల్పనలోనే వైసీపీ బోల్తాపడింది. ప్రజలకు కొత్తగా ఒక హామీ కూడా ఇవ్వలేకపోయారు. దీంతో ఎన్నో ఊహాగానాలు అల్లుకున్న ఆ పార్టీ కేడర్ సైతం డీలా పడిపోయింది. శనివారం ప్రకటించిన వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టో ముందు బోల్తాపడింది. గతంలోని పథకాలకే కొన్ని రంగులు పులిమి, నవరత్నాలు పేరిట ఉన్న పథకాలనే కొనసాగిస్తామని చెబుతూ రెండు పేజీలతో సరిపెట్టారు. నిజానికి ఆనాటి హామీలు కూడా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. అలాగే ఆయా పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను కుదించి, అరకొరగా అమలుచేశారు. దీంతో అర్హులెందరికో లబ్ధి చేకూరలేదు. ఆదిలోనే పింఛను విషయంలో బురిడీ కొట్టించిన వైనాన్ని పలువురు గుర్తుచేస్తున్నారు. మూడు వేల పింఛను ఇస్తామని.. ఏడాదికి రూ.250 ఇవ్వడంపై లబ్ధిదారులు ఇప్పటికే గుర్రుగా ఉన్నారు. ప్రస్తుత మేనిఫెస్టోలో కూడా ఇదే పాట పాడగా, రూ.500 మాత్రమే పెంచి అది కూడా చివరి రెండు ఏళ్లలో పెంచుతామని మెలిక పెట్టారు. అంటే పెన్షన్ల సొమ్ము ఈ ఏడాది పెంచరట. వచ్చే ఏడాది 2025లో పెంచరు. 2026, 2027లోనూ పెంచరు. ఎన్నికల చివరి ఏడాది అంటే 2028లో రూ.250, ఎన్నికల ఏడాది 2029లో రూ.250 పెంచి మొత్తం రూ.3,500 చేస్తారట. ఈ ప్రకటన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీల కింద పెన్షన్ పొందుతున్న వారిలో తీవ్ర ఆవేదన మిగిల్చింది. ఆగ్రహానికి గురిచేసింది. దివ్యాంగులకు వైసీపీ పాలనలో తీరని అన్యాయం చేశారు. వారికి ఒక్క రూపాయి కూడా పెంచలేదు. ఇప్పుడూ వారి మాట మరిచారు. ఇక టీడీపీ ఏడాది కిందటే సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు అనేక వరాలిచ్చింది. ఇప్పుడు కూటమి తరఫున కూడా ఈ పథకాలను ఇస్తామంటూ చంద్రబాబు, పవన్ భరోసా ఇచ్చారు. అందులో నెలకు రూ.4 వేల పింఛన్.. అది కూడా ఏప్రిల్ నుంచే లెక్కకట్టి, జూలై నెలలో ఏకంగా ఏడు వేలు ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. దివ్యాంగులకు నెలకు రూ.ఆరు వేలు ఇస్తానని స్పష్టంచేశారు. ఇక వైసీపీ అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించింది. దీంతో వేలాది మంది బీసీలు స్థానిక సంస్థల్లో పదవులు కోల్పోయారు. కానీ జగన్ మేనిఫెస్టోలో ఆ ఊసే లేదు. టీడీపీ కూటమి మాత్రం బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతామని స్పష్టంచేసింది. అలాగే బీసీలకు కూడా రక్షణ చట్టం తీసుకొస్తామని సూపర్ సిక్స్‌లో ప్రకటించారు. బీసీ రిజర్వేషన్లు, బీసీ రక్షణ చట్టంపై ప్రధానంగా ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక మహిళల విషయంలో కూడా పాతపాటే. ఎంతో చేశానని, అదే మళ్లీ చేసేస్తానని జగన్ చెప్పారు. ఇది కూడా మహిళల్లో మరింత అసంతృప్తిని రేపింది. బటన్ నొక్కిన కొన్ని నెలలకు కొంత జమ చేస్తూ ఈ ఐదేళ్లు మహిళలను ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. ఇవాళ టీడీపీ కూటమి మహిళలకు మహాశక్తి పథకం అమలుచేయనుంది. ఆడబిడ్డ నిధి కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది మహిళలకు నెలకు రూ.1500 ఇస్తారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు వారికి ఏడాదికి రూ.15వేల వంతున ఇస్తామని ప్రకటించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రకటించింది. ఇక రైతులకు ఏడాది రూ.20 వేలు పంట పెట్టుబడికి ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఇలా అన్నివర్గాల సంక్షేమంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనే కూటమి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఇవాళ జగనన్న ఇళ్లు పేరిట కేవలం సెంటు భూమి పనికిరాని భూముల్లో ఇవ్వగా, తాము 3 సెంట్ల భూమి ఇచ్చి.. ఇల్లు మంజూరు చేస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. 2019కే పూర్తి కావలసిన పోలవరాన్ని ఐదేళ్లలో గాలికి వదిలేసిన జగన్, దీని నిర్మాణానికి మరో ఐదేళ్లు కావాలని మేనిఫెస్టోలో పెట్టడాన్ని జనం ఆక్షేపిస్తున్నారు. తిరకాసు, మోసపూరిత హామీలతో బురిడీ కొట్టించాలని చూస్తే.. జనం నమ్మరని జగన్ మేనిఫెస్టోపై పలువురు వ్యాఖ్యానించారు.

ఒరిగేదేం లేదు...



వైసీపీ మేనిఫెస్టో నిరాశపరిచింది. దీనివల్ల ప్రజలకు కొత్తగా ఒరిగేది ఏం లేదు. అవ్వాతాతలకు రూ.4 వేల పింఛను ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. సూపర్ సిక్స్ పథకాలు అందరికీ మేలు చేకూరుస్తాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి నెలా ఆర్థిక చేయూత ఇస్తామని బాబు హామీ ఇచ్చారు.

- కరుటూరి విశ్వేశ్వరి, అంకంపాలెం

చంద్రబాబు హయాంలోనే బాగు



ప్రతీ ఇంటికీ పింఛన్, ఇల్లు, రేషన్‌కార్డులు వంటి పథకాలు చంద్రబాబు ప్రభుత్వం హయాంలో కూడా అమలుచేశారు. కొత్తగా జగన్ ప్రభుత్వంలో ఒరగబెట్టింది లేదు.

- సత్యవతి, సామర్లకోట

అంతా మోసమే..



ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ గత ఎన్నికల మేనిఫెస్టోలో 95 శాతం పూర్తి చేశానని చెప్పి ప్రజల్ని మోసం చేశారు. యువకులు నిరుద్యోగంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రజలకు ఏదీ అందలేదు.

- సత్తిరాజు ఆదిత్యకిరణ్, కొత్తపేట

వై.. చీప్ రాజకీయం!





పిఠాపురంలో పట్టుబడిన మద్యం (ఫైల్)

- ఎన్నికల వేళ.. వైసీపీ మద్యం స్కీమ్
- గోవా నుంచి గోదావరికి అక్రమ మద్యం
- భారీగా కంటెయినర్లలో డంప్
- లోకల్‌గానూ తయారీ
- అన్ని నియోజకవర్గాలకు సరఫరా
- పిఠాపురం,కాకినాడల్లో పట్టివేత
- తూతూ మంత్రంగా కేసులు

మద్యం దందా 6

పిఠాపురం, ఏప్రిల్ 27: వైసీపీ నాయకులా మజాకానా.. టక్కుటమార విద్యల్లో ఆరితేరిన వారు.. అందుకే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చీపు రాజకీయానికి తెరలేపుతున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీగా మద్యం నిల్వలు తెచ్చి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిల్వ చేస్తోంది. గోవా మద్యంతో పాటు రాష్ట్రంలోనూ తయారు చేసి అవే లేబుల్స్ ఉన్న సీసాల్లో నింపుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటికే కాకినాడ, పిఠాపురంలలో భారీగా మద్యం డంప్‌లు బయట పడ్డాయి. విలువ రూ.1.50 కోట్లకు పైగా ఉంది. ఇంతకు వంద రెట్లు అధికంగా కాకినాడ జిల్లాకు మద్యం నిల్వలు చేరినట్టు సమాచారం.

బరితెగించిన వైసీపీ నేతలు..

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగియకుండానే జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. వైసీపీ నేతలు బరితెగించి భారీగా మద్యం పంపిణీ చేస్తున్నారు. గోవా నుంచి కంటెయినర్ల ద్వారా మద్యం జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నట్టు సమాచారం. అంతే కాకుండా గోవా మద్యం సీసాల్లో రాష్ట్రంలోని రెండు ఫ్యాక్టరీల్లో తయారైన మద్యాన్ని నింపి ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్టు సమాచారం. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంతో పాటు కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజవర్గాలకు ఇప్పటికే భారీ మద్యం నిల్వలు చేరాయి. ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.5 నుంచి రూ.పది కోట్లు విలువైన మద్యాన్ని చేర్చినట్టు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమంగా తీసుకువచ్చినట్టు చెబుతున్నారు.

పట్టుబడిన మద్యం బ్రాండ్లు ఇవే



పిఠాపురం నియోజకవర్గంలో జరిగిన దాడుల్లో పట్టుబడిన మద్యం బ్రాండ్లు అన్నీ గోవా తయారీ మద్యం బ్రాండ్లుగా చెబుతున్నారు. ఇవన్నీ ఎన్‌డీపీఎల్ లిక్కర్ కావడంతో కేసు తీవ్రత అధికంగా ఉంటుంది. పట్టుబడిన వాటిలో రాయల్ బ్లూ, గోవా కిక్ విస్కీ, బొంబాయి సెంట్రల్ క్లాసిక్ టోటల్ విస్కీ, గోవా క్విక్ ఫైనెస్ట్ సుపీరియర్ విస్కీ,యూకే నెంబరు 1 రేర్ విస్కీ, రాయల్ స్టైల్ విస్కీ, గోవా విస్కీ బ్రాండ్లు ఉన్నాయి.ఇప్పుడు ఇవి ఎక్కడ తయారయ్యాయి, వీటిని ఎలా తరలించారు, ఎవరు తరలించమన్నారు తదితర విషయాలపై దర్యాప్తు చేయాల్సిన పోలీసు,సెబ్ అధికారులు అసలు విషయాన్ని వదిలి తూతూమంత్రంగా నాలుగుచోట్ల ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేసినట్టు చెబుతున్నారు. ఇప్పటికే ఇంత భారీగా మద్యం నియోజకవర్గాలకు తరలించిన వైసీపీ రానున్న రోజుల్లో ఇక ఎన్ని కుట్రలకు తెరలేపుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ కీలక నేతల ఫ్యాక్టరీల్లోనే..

ఈ అక్రమ మద్యం వ్యవహారంలో రాష్ట్రానికి చెందిన వైసీపీ ఎంపీలుగా ఉన్న ఇద్దరు నేతలు, కాకినాడ జిల్లా కేంద్రం కీలక నేత ఒకరు కీలకపాత్ర పోషించినట్టు చెబుతున్నారు. ఆ ఇద్దరు ఎంపీలకు లిక్కర్ తయారీ యూనిట్లు ఉండడంతో అక్కడ ఈ మద్యాన్ని తయారు చేయించి గోవా బ్రాండ్ల స్టిక్కర్లు అంటించి ఉన్న సీసాల్లోకి నింపినట్టు చెబుతున్నారు. గోవా మద్యంతో పాటు అంతకు రెండింతలు లోకల్ మద్యం వివిధ ప్రాంతాలకు డంప్ చేసినట్టు చెబుతున్నారు. పిఠాపురం పట్టణంలోని మూడు చోట్ల, కుమారపురంలో ఒక చోట గృహాల్లో డంప్‌లపై ఎస్ఈబీ, పోలీసు అధికారులు దాడులు చేశారు. ఇక్కడ ఏకంగా 52,992 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.కోటి పైగా ఉంటుందని అంచనా. కాకినాడలోనూ మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ రూ.50 లక్షలు ఉంటుంది.రెండు చోట్ల పట్టుబడిన మద్యం చాలా తక్కువని, ఇంతకు వంద రెట్లు నిల్వలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

ఓటర్లను మద్యంతో ముంచెత్తడమే లక్ష్యంగా

ఓటర్లను మద్యం మత్తులో ముంచేయాలని వైసీపీ నేతలు ముందు నుంచీ భావిస్తున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో మద్యం పంపిణీ ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రతి రోజు మద్యం పంపిణీ చేయాలని, పోలింగ్ చివరి ఐదు రోజులు ప్రజలు కోరినంత మద్యం పంపిణీ చేయాలని వైసీపీ పెద్దలు నియోజకవర్గాల నేతలకు చెప్పినట్టు సమాచారం.పిఠాపురంలో పవన్‌ను ఓడించాలనే లక్ష్యంతో ఉన్న వైసీపీ అధినాయకత్వం అక్కడ మద్యాన్ని ఏరులై పారించాలని పన్నాగం పన్నినట్టు ఇతర పార్టీల అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కాకినాడ, పిఠాపురంలలో మద్యం నిల్వలు పట్టుబడిన నేపథ్యంలో రెండు, మూడు రోజుల పాటు లిక్కర్ పంపిణీకి వైసీపీ నేతలు తాత్కాలికంగా ఫులిస్టాప్ పెట్టారు. అంతే కాకుండా వైసీపీ నేతలు తమ మద్యం నిల్వలను దూర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. సెబ్, పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తే మరింత భారీగా నిల్వలు బయటపడతాయని అందరు భావిస్తున్నా ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
ఆదివారం 28 ఏప్రిల్ 2024 6

మద్యం దందా



- ఎక్కడికక్కడ రహస్య ప్రదేశాల్లో మద్యం డంప్
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వైసీపీ ఎర
- ఉమ్మడి జిల్లాలోకి గోవా మద్యం దిగుమతి

ఇవేం బ్రాండ్లు..!

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 27 : వైసీపీ పాలనలో రకరకాల మద్యం బ్రాండ్లు తెచ్చి నాణ్యత లేని సరుకుతో మద్యంబాబులను ఇష్టాను సారం దోచుకున్న విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను మద్యంతో ప్రలోభపెట్టడానికి ఇప్పటికే కావలసినంత సరుకును రహస్య శిబిరాల్లో ఆ పార్టీ డంపు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. రాజమహేంద్రవరం పరిధిలోని దివాన్ చెరువు ప్రాంతంలో అంగన్‌వాడీ పాలప్యాకెట్ల పేరిట ఓ పెద్ద లారీ సరుకును డంప్ చేసినట్టు తాజా సమాచారం. ప్రస్తుతం మార్కెట్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరుకు దొరకని విధంగా ఇప్పటికే కొరత సృష్టించింది. గత ఏడాది కంటే అమ్మకాలు 30 శాతం కంటే ఎక్కువ ఉండకూడదని, అందువల్లే షాపుల్లో సరుకు తగ్గించామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో తమ వద్ద భారీగా నిల్వలు ఉంచిన మద్యాన్ని ఓటర్లకు ఎరగా వేసే ప్రయత్నాలు వైసీపీ నేతలు మొదలుపెట్టారు. పోలింగ్ దగ్గరపడే సమయానికి పెద్దఎత్తున మద్యం పంపిణీ చేసేందుకు వీలుగా ఎక్కడికక్కడ మద్యం నిల్వలను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.

గోవా సరుకు..!

ఆత్రేయపురం, ఏప్రిల్ 27: ప్రస్తుత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు నెలల ముందే పెద్దఎత్తున గోవా మద్యం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి దిగుమతి అయింది. ప్రాంతాల వారీగా ఎక్కడికక్కడ గొడౌన్లలో నిల్వలు దాచారు. గోవాలో ఏ బ్రాండ్ కావాలని అడిగితే ఆ బ్రాండ్ స్టిక్కర్‌తో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉన్న చీప్‌లిక్కర్‌తో తయారుచేసే మాఫియా ఉన్నట్టు చెబుతున్నారు. అలా ఒక లారీకి బాక్స్‌కు 48 బాటిల్స్ చొప్పున 600 నుంచి 1200 బాక్సులు లారీల ద్వారా గోవా లిక్కర్ గ్యాంగ్‌లు జిల్లాకు తీసుకువచ్చి ఆర్డర్ చేసిన వారికి అప్పగిస్తారు. లారీ చీప్ లిక్కర్ రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేస్తారు. ఈ దందా సాగించే స్థానిక వ్యాపారులు మూడు రెట్లు వేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం చీప్ లిక్కర్ ధర రూ.130 ధర ఉండగా గోవా బాటిల్ రూ.60కే లభిస్తుంది. నిజానికి ఈ దందా సాగాలంటే మామూలు రోజుల్లో కష్టం. పోలీసులు, సెబ్ అధికారులు చూడీచూడనట్టు ఉంటేనే వీలవుతుంది. ప్రభుత్వ పెద్దల సహకారంతోనే భారీ ఎత్తున గోవా మద్యం ఇక్కడకు డంప్ అయినట్టు సమాచారం.

రాగంపేటలో మూసేసిన మద్యం దుకాణం



దుకాణాల్లో నియంత్రణ

గండేపల్లి, ఏప్రిల్ 27: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిననాటి నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలపై ఎన్నికల అధికారులు ఆంక్షలు విధించారు. ఒక్కొక్కరికి ఒక్కో బాటిల్ మాత్రమే మద్యం అమ్మాలని నిబంధన పెట్టారు. దీంతో సాయంత్రానికే మద్యం టార్గెట్‌లు అయిపో వడంతో దుకాణాలు మూసేస్తున్నారు. ఈ మద్యం కూడా వైసీపీ నాయకుల అండతో పక్కదారి పడుతోంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అమ్మకాలు చేసేవారు. గత సంవత్సరం ఈరోజు ఎంత మద్యం అమ్మారో, ఇప్పుడే అంతే మద్యం అమ్మాలని నిబంధన పెట్టారు. అయితే మధ్యాహ్నానికే మద్యం అయిపోతుండ డంతో సరుకంతా ఎక్కడికిపోతుందో అర్థం కావడంలేదని పలువురు నిలదీస్తున్నారు.

మద్యాన్ని స్టాకేశారు..

కొత్తపల్లి, ఏప్రిల్ 27: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం నిల్వలు చేసినట్టు సమాచారం. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాల్లోని సరుకును అధికార పార్టీకి చెందిన ప్రతినిధులు రాత్రి సమయాల్లో ఆయా గ్రామాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. గత రెండు, మూడు రోజుల నుంచి ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాల్లో నిల్వలు ఉంచినట్టు తెలుస్తోంది.

ఇదే దందా అంటే..

సామర్లకోట, ఏప్రిల్ 27: రోజూవారీ అమ్మకాల లక్ష్యం పూర్తయితే ప్రభుత్వ మద్యం దుకాణాలను మధ్యాహ్నానికే మూసివేస్తున్నారు. దీంతో మందుబాబులు అనివార్యంగా బెల్ట్‌షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. సదరు బెల్ట్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందికి ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా చెల్లిస్తున్నారు. బెల్ట్ షాపులవారు రూ.50 లాభం చూసుకుని విక్రయిస్తున్నారు. రోజూవారీ అలవాటు ఉన్నవారు చేసేదిలేక అంతపెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఆ దందాను నియంత్రించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి అయినా చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సామర్లకోటలో దుకాణం క్లోజ్



వరుణ్‌తేజ్ రోడ్ షో

- పవన్‌కు మద్దతుగా మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ ప్రచారం
- గొల్లప్రోలు మండలంలో పలు ప్రాంతాల్లో పర్యటన
- భారీగా తరలివచ్చిన అభిమానులు..కూటమి కార్యకర్తలు



గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల పంట పొలాల మధ్య సాగుతున్న ర్యాలీ





పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 27: ప్రముఖ సినీనటుడు, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి, చెందుర్తి, దుర్గాడ గ్రామాల్లో శనివారం రాత్రి పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. ముందుగా తాటిపర్తి గ్రామంలోని అపర్దాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం రోడ్‌షో ప్రారంభించారు. ఓపెన్‌టాప్ కారులో నిల్చుని ప్రజలకు అభివాదం చేసుకుంటూ తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల్లో ప్రచారం సాగించారు. వరుణ్‌తేజ్ రోడ్‌షో ముందు భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ జరిగింది. జనసైనికులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భారీగా తరలివచ్చారు. మహిళలు వరుణ్‌పై పూలవర్షం కురిపించారు. హారతులు ఇచ్చారు. తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి, చెందుర్తి గ్రామాల మీదుగా దుర్గాడ వరకూ సాగిన రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. దుర్గాడలో వరుణ్ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఎక్కడికక్కడ ప్రజలు, మహిళలు ఇళ్ల బయటకు వచ్చి గాజుగ్లాసు చూపిస్తూ అభివాదం చేయడం విశేషం. ప్రచారంలో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, టీడీపీ యువనేత గిరీష్‌వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

పాదగయలో పూజలు



పిఠాపురం, ఏప్రిల్ 27: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ప్రముఖ సినీనటుడు వరుణ్‌తేజ్ సందర్శించారు. తన తండ్రి, జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికాఅమ్మవార్లను శనివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వరుణ్‌తేజ్ తల్లి కూడా పాల్గొన్నారు. ఆలయ విశిష్టత గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. వరుణ్‌తేజ్ రాక తెలుసుకున్న అభిమానులు, జనసైనికులు భారీగా తరలివచ్చారు. తన బాబాయి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపు కోసం పూజలు చేసినట్లు వరుణ్‌తేజ్ తెలిపారు.

మెట్టలో రాజకీయ పర్వతం

- ప్రత్తిపాడు నియోజకవర్గంలో రాజకీయ దిగ్గజ కుటుంబం
- ఒకే కుటుంబంలో ఐదుగురు ఎమ్మెల్యేలు
- పర్వత ఫ్యామిలీకి నియోజకవర్గానికి విడదీయరాని బంధం



పర్వత గుర్రాజు



పర్వత సుబ్బారావు



పర్వత బాపనమ్మ



పర్వత చిట్టిబాబు



పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 27: ప్రత్తిపాడు నియోజకవర్గ రాజకీయ చరిత్రకు పర్వత కుటుంబానికి విడదీయరాని బంధం ఉంది. రాజకీయ పదవులకు కేరాఫ్ అడ్రస్‌గా పర్వత కుటుంబం ఉంది. 14 విడతలు జరిగిన నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కుటుంబం 8 విడతలు పోటీ చేసి 5 విడతలు విజయం సాధించి 3 విడతలు ఓటమి చూసింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పర్వత కుటుంబం నుంచి ప్రధాన రాజకీయ పక్షం నుంచి అవకాశం ఉంటుందని పర్వత అభిమానులు భావించినా చివరికి నిరాశ మిగిలింది. ఈ ఎన్నికల్లో పర్వత కుటుంబం నుంచి ఎవరూ ఎన్నికల బరిలో లేరు. పర్వత కుటుంబానికి ఎమ్మెల్యే పదవికి ఆద్యుడు పర్వత గుర్రాజు. నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 1955లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆయన మొట్టమొదటి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన సోదరుడు పర్వత సుబ్బారావు 1994లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించగా, సుబ్బారావు సతీమణి బాపనమ్మ 1999లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అలాగే పర్వత గుర్రాజు మరో సోదరుడు పర్వత శ్రీరామమూర్తి తనయుడు పర్వత సత్యనారాయణమూర్తి (చిట్టిబాబు) 2009లో టీడీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అలాగే గుర్రాజు మరో సోదరుడు పర్వత కొండలరావు కుమారుడు పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ 2019లో వైసీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. ప్రస్తుతం ఆయనే ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈ కుటుంబంలోని పర్వత శ్రీరామమూర్తి రెండో కుమారుడు పర్వత రాజబాబు ప్రస్తుతం శంఖవరం మండలాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. పర్వత గుర్రాజు సోదరుడు నరసింహారావు శంఖవరం సమితికి 20 ఏళ్ల పాటు అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఆయన సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్‌గా కూడా కొనసాగారు. ఇంకా పర్వత కుటుంబీకుల్లో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ సతీమణి సత్యవేణి జడ్పీటీసీగా గతంలో పనిచేశారు. పర్వత రెడ్డి నాయుడు అన్నవరం దేవస్థానం డైరెక్టర్‌గా రెండు సార్లు నియమితులయ్యారు. ప్రస్తుతం పర్వత గుర్రాజు తనయుడు సత్యనారాయణ సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాజకీయ పదవులకు చిరునామాగా ఉండే పర్వత కుటుంబం నుంచి ప్రస్తుతం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అవకాశం లభించకపోవడం ఆ కుటుంబ అభిమానులను నిరుత్సాహానికి గురి చేసింది.

రాజకీయ ఉద్దండుల కోట కొత్తపేట

రాజకీయ ఉద్దండుల కోటగా కొత్తపేట నియోజకవర్గానికి పేరుంది. వాడపల్లి వెంకన్న, ర్యాలి జగన్మోహినీకేశవస్వామి, మందపల్లి శనేశ్వరస్వామి ఆలయాలు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. గౌతమి, వశిష్ఠ నదీపాయల మధ్య ఎన్నో విశిష్టతలు కలిగిన కొత్తపేట నియోజకవర్గం ఎందరో రాజకీయ నేతల ఏలుబడిలో కొనసాగింది.

వాడపల్లి వెంకన్న ఆలయం



1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గాన్ని అపర చాణుక్యుడిగా పేరు పొందిన కళా వెంకట్రావు, రాజకీయ దిగ్గజం ఎంవీఎస్ సుబ్బరాజు, రాజకీయ ఉద్దండులు చిర్ల సోమసుందరరెడ్డి, బండారు సత్యానందరావు పాలించారు. పునర్విభజన తర్వాత జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గంగా మారి కోనసీమ రాజకీయాలకు కేంద్ర బిందువైంది. 1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో 37 గ్రామాలు ఉండగా పునర్విభజన అనంతరం 57 గ్రామాలకు చేరుకుంది. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలతో భౌగోళికంగానే కాకుండా సామాజిక సమీకరణాల్లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. వైసీపీ తరపున ప్రస్తుత ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ తరఫున బండారు సత్యానందరావు రాజకీయాలను శాసిస్తూ వచ్చారు. ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కలయికతో కూటమి అభ్యర్థిగా బండారు సత్యానందరావు నుంచి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గట్టిపోటీనే ఎదుర్కోనున్నారు.

● (కొత్తపేట)


రావులపాలెం కోనసీమ ముఖద్వారం



ఆత్రేయపురం పూతరేకులు ఖండ్రిగ పాలకోవ, రావులపాలెం కుండ బిర్యానీ ఈ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో స్పెషల్స్



రావులపాలెం-జొన్నాడ గౌతమి వంతెన



రాజకీయ చైతన్యం

కొత్తపేట ప్రత్యేక రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గం. ఇక్కడ ఏ పార్టీ విజయం సాధిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం చేపడుతోంది. అయితే నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 15సార్లు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, రెడ్డి కాంగ్రెస్‌తో కలుపుకుని ఏడుసార్లు విజయం సాధించగా నాలుగుసార్లు టీడీపీ, రెండుసార్లు వైసీపీ గెలుపొందాయి.

ఓటర్ల వివరాలు

2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం 3 లక్షల 36 వేల మంది ఉన్నారు. నియోజకవర్గంలో 2,48,392 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళా ఓటర్లు 1,24,998 మంది కాగా పురుషులు 1,23,389 మంది ఉన్నారు. ఇతరులు 5గురు ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 262 ఉన్నాయి.


సమస్యలు ఇవి

ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సి ఉంది. మధ్య డెల్టాకు ఆయువుపట్టుగా ఉన్న లొల్ల, వాడపాలెం లాకుల వ్యవస్థను ఆధునికీకరించి రైతుల సాగునీటి ఇబ్బందులను పరిష్కరించాల్సి ఉంది. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు మెగా వాటర్ ప్రాజెక్టు ద్వారా సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. రావులపాలెం జాతీయ రహదారిపై ప్లై ఓవర్ నిర్మించాలి. మురుగునీరు సక్రమంగా పారేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వాడపల్లి, మందపల్లిలను టూరిజం ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి.

ఎమ్మెల్యేలుగా పనిచేసింది వీళ్లే..



కళా వెంకట్రావు



ఎంవీఎస్ సుబ్బరాజు



దెందులూరి భానుతిలకం



చిర్ల సోమసుందర్‌రెడ్డి



ఐఎస్ రాజు



బండారు సత్యానందరావు



చిర్ల జగ్గిరెడ్డి

సంవత్సరం	విజేత	పార్టీ
1959	కళా వెంకట్రావు	కాంగ్రెస్
1962	ఎంవీఎస్ సుబ్బరాజు	కాంగ్రెస్
1967	ఎంవీఎస్ సుబ్బరాజు	కాంగ్రెస్
1972	దెందులూరి భానుతిలకంరెడ్డి	కాంగ్రెస్
1978	ఎంవీఎస్ సుబ్బరాజు	జనతాపార్టీ
1983	చిర్ల సోమసుందరరెడ్డి	టీడీపీ
1985	ఐ.ఎస్.రాజు	టీడీపీ
1989	చిర్ల సోమసుందరరెడ్డి	కాంగ్రెస్
1984	బండారు సత్యానందరావు	టీడీపీ
1999	బండారు సత్యానందరావు	టీడీపీ
2004	చిర్ల జగ్గిరెడ్డి	కాంగ్రెస్
2009	బండారు సత్యానందరావు	ప్రజారాజ్యం
2014	చిర్ల జగ్గిరెడ్డి	వైసీపీ
2019	చిర్ల జగ్గిరెడ్డి	వైసీపీ

జన కేతనం ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
ఆదివారం 28 ఏప్రిల్ 2024 7


మద్యం నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

మద్యం కేసును నీరుగార్చుతున్నారా?

వైసీపీ కీలక నేతను తప్పించి యువకుడిపై కేసు
రెండు చోట్ల పోలీసులు, మరో రెండు చోట్ల సెబ్‌లో కేసులు నమోదు
వైసీపీ నేతలంతా పరారీలో ఉన్నారట..!
వైసీపీ పెద్దల ఒత్తిడితో కేసు తారుమారు

పిఠాపురం, ఏప్రిల్ 27: ఏకకాలంలో నాలుగు చోట్ల దాడులు నిర్వహించి కోటి రూపాయల విలువైన గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటనలో నమోదైన కేసులను నీరుగార్చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ కీలక నేతను తప్పించి అతని వద్ద పనిచేసే కార్మికుడిపై కేసు పెట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో పెద్దల ఒత్తిడితో మద్యం నిల్వలు వెనుక ఉన్న వారిపై కేసు దర్యాప్తు వెళ్లకుండా అడ్డుపుల్ల వేసి కేసులను తారుమారు చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం నిల్వలు పట్టుకునే వరకూ పకడ్బందీగా వ్యవహరించిన సెబ్, పోలీసు అధికారులు రాత్రి జరిగిన పరిణామాల తర్వాత నోరు మెదిపేందుకు ఇష్టపడకపోవడం, నమోదయిన కేసుల వివరాలను రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పవన్ కల్యాణ్‌ను ఎలాగైనా ఓడించేందుకు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు భారీగా మద్యాన్ని డంప్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో స్టేట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసు అధికారులు పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో వట్టూరి సతీష్‌కుమార్, సాలిపేటలో అంబటి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటితో పాటు మండలంలోని కుమారపురం గ్రామంలోని వేమగిరి సువార్తమ్మ ఇళ్లపై శుక్రవారం రాత్రి ఏకకాలంలో దాడి చేశారు. నాలుగు చోట్ల కలిపి 52,992 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు సోదరుడు వీరబాబుదిగా స్థానికులు తెలిపారు. మద్యం దొరికిన ఇళ్లన్నీ వైసీపీ నాయకులవే కావడంతో ఆ పార్టీకి చెందిన నిల్వలుగా తేలిపోయింది. ఇక్కడ వరకూ పకడ్బందీగా వ్యవహరించిన అధికారులు రూటు మార్చారు.

కేసులు పంచుకున్నారు

నాలుగు చోట్ల దొరికిన మద్యానికి సంబంధించి పిఠాపురం పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఒక్కొక్క కేసు, సెబ్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కేసులో వట్టూరి సతీష్‌కుమార్, కుమారపురం కేసులో వేమగిరి సువార్తమ్మపై పోలీసులు కేసు నమోదు చేయగా, సెబ్ అధికారులు సాలిపేటలో పట్టుబడిన మద్యం విషయంలో అంబటి వీర వెంకట సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేశారు. వైఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటి విషయంలో మాత్రం అక్కడ పనిచేసే జగ్గంపేట మండలం రాజపూడికి చెందిన 20 సంవత్సరాల యువకుడు గండికోట దుర్గారామయ్యపై కేసు నమోదు చేయడం గమనార్హం. నాలుగు కేసుల్లో దొరికిన మద్యం నిల్వలు అన్నీ ఒకే రకానికి చెందిన నాన్ డ్యూటీ పెయిడ్‌లిక్కర్ అయినప్పుడు కేసులు పంచుకోవడం, ఎవరి దర్యాప్తు వారు చేస్తున్నట్లు చెప్పడంతో అనుమానాలు ప్రారంభమయ్యాయి.

ఒత్తిళ్లు పనిచేశాయా?

పిఠాపురం పట్టణం, మండలంలోని కుమారపురంలో పట్టుబడిన మద్యం విషయంలో వైసీపీ పెద్దల ఒత్తిళ్లు పనిచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా కోటి రూపాయల విలువైన మద్యం పట్టుబడినప్పుడు, అది ఎన్నికల సమయంలో ఎస్పీ లేదా ఆ స్థాయి అధికారి వివరాలు వెల్లడిస్తారు. ఇక్కడ మాత్రం అది జరగలేదు. వైసీపీ పట్టణాధ్యక్షుడి బంధువులకు చెందిన ఇల్లుగా చెబుతున్నా, వారిని తప్పించి ఒక యువకుడిపై కేసు నమోదు చేయడం, అసలు సరుకు ఎవరు తెచ్చారు, ఎవ్వరు తెమ్మన్నారు, ఎక్కడి నుంచి వచ్చింది తదితర విషయాలు దర్యాప్తు చేయాల్సిన పోలీసులు, సెబ్ అధికారులు నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పి తప్పించుకోవడం ఒత్తిళ్ల ప్రభావమేనని చెబుతున్నారు. ఇది ఎన్‌డీపీఎల్ లిక్కర్ కావడంతో కేసు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అది కాకుండా నాసిరకం మద్యాన్ని స్థానికంగా తయారు చేసి గోవా మద్యం బాటిళ్లల్లో నింపారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవి అధికారులు పట్టించుకోవడం లేదా లేక ఒత్తిడులతో పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

'తూర్పు' ఓటర్లు 16,23,149 మంది

- పురుషులు-7,92,317,మహిళలు-8,30,735, థర్డ్ జెండర్-97
- రాజమహేంద్రవరం రూరల్ అత్యధికం, కొవ్వూరులో అత్యల్పం
- తుది జాబితా ప్రకటించిన జిల్లా ఎన్నికల అధికారి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మే నెల 13న జరిగే పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకునే అర్హత సాధించిన ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శనివారం రాత్రి ప్రకటించారు. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 16,23,149 మంది. పురుషులు-7,92,317మంది, మహిళలు-8,30,735 మంది ఉండగా థర్డ్ జండర్ 97మందిగా నమోదయ్యారు. జిల్లాలో పురు షుల కంటే మహిళా ఓటర్లు 38,418మంది ఎక్కువగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ ఉన్నారు. ఇక జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా రాజమహేంద్రవరం రూరల్ నమోదైంది. అక్కడ 2,72,826 మంది ఉండగా అందులో మహిళలు 1,39,561మంది ఉండగా, పురుషులు 1,33241 మంది ఉన్నారు. థర్డ్ జండర్ 24మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు. ఇక్కడ మొత్తం ఓటర్లు 1,84,136మంది, పురుషులు 89,743మంది, మహిళలు 94,388మంది, థర్డ్ జెండర్ 5మంది ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఓటర్ల సంఖ్య పరంగా రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2,67,484మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 1,38695మంది ఉండగా, పురుషులు 128,739మంది, థర్డ్ జెండర్లు 50మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గం ఓటర్ల పరంగా మూడో స్థానం ఉంది. ఇక్కడ 2,42,763మంది ఉండగా, పురుషులు 1,18,965మంది, మహిళలు 1,23,793 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ 5 ఉన్నారు. అనపర్తి నాల్గో స్థానంలో ఉంది. ఇక్కడ 2,26,053మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 110,515, మహిళలు 115535, థర్డ్ జెండర్ ముగ్గురు ఉన్నారు. రాజానగరం ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 216,491 మంది. అందులో పురుషులు 106879మంది, మహిళలు 109606మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఆరుగురు ఉన్నారు. నిడదవోలు ఆరో స్థానంలో ఉంది. ఇక్కడ మొత్తం 213,396మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 104235, మహిళలు 109157మంది ఉన్నారు. థర్డ్ జెండరు నలుగురు ఉన్నారని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు.

రెండు రోజులు పవన్ రోడ్‌షో

29, 30 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటన

పిఠాపురం, ఏప్రిల్ 27: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 29,30వ తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ శనివారం మీడియాకు తెలియజేశారు. 29వ తేదీ ఉదయం 8 గంటలకు గొల్లప్రోలు మండలం చెందుర్తి నుంచి రోడ్‌షో ప్రారంభించి కొడవలి, వన్నెపూడి, మీదుగా పిఠాపురం మండలంలోకి ప్రవేశించి వెల్దుర్తి, పి.తిమ్మాపురం, బి.కొత్తూరు, గోకివాడ, జములపల్లి, నరసింగపురం, ఎల్ఎన్‌పురం, విరవాడ, విరవ, మల్లాం, జల్లూరు, కందరాడ, కుమారపురం గ్రామాల మీదుగా రోడ్‌షో సాగుతుందని తెలిపారు. 30వ తేదీన ఉదయం 9గంటలకు చిత్రాడలో రోడ్‌షో ప్రారంభించి గొల్లప్రోలు పట్టణంలో కొనసాగుతుందని చెప్పారు. 29వ తేదీ రోడ్‌షోలో పంట పొలాలు పరిశీలించడంతో పాటు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్వీర్యం కావడం వలన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకుంటారని, రైతులు, ఆయా వర్గాల ప్రజలతో మాట్లాడతారని వివరించారు. టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పవన్ రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

ఓటుతో తోట త్రిమూర్తులుకు బుద్ధి చెప్పాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత నేతల పిలుపు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు

మండపేట, ఏప్రిల్ 27: దళిత యువకుల శిరోముండనం కేసులో శిక్ష పడిన తోట త్రిమూర్తులును ఓటు అనే వజ్రాయుధంతో ఓడించి బుద్ధి చెప్పాలని దళితసంఘాల నేతలు పిలుపు నిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని శుభమస్తు కల్యాణ మండపంలో శనివారం దళిత నేత దూళి జయరాజు అధ్యక్షతన ఏపీలో దళితులపై దమనకాండను నిరసిస్తూ దళిత జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి పలువురు దళిత నేతలు, దళిత ఉద్యమ నేతలు హాజరయ్యారు. జాతీయ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు దళిత యువకుల శిరోముండనం కేసులో శిక్ష పడిందని అలాంటి వ్యక్తికి ఇపుడు అసెంబ్లీ సీటు ఇవ్వటం సిగ్గుచేటన్నారు. దళిత ఉద్యమ నేత అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ దళితులపై శిరోముండనం జరిగినప్పుడు దళిత నేత బొజ్జా తారకం, తాను వెంకటాయపాలెం వెళ్లి నిజనిజాలను వెలికి తీశామని ఈసంఘటనపై ఎనలేని పోరాటం చేసిన వ్యక్తి బొజ్జా తారకం అన్నారు. తోటను దళిత నేతలు దళితాసుర అని ఆరోపించారు. సభకు అధ్యక్షత వహించిన దూళి జయరాజు మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో ఉన్న 33 వేల దళిత ఓట్లు చీలిపోకుండా కూటమికి వేసి కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలని కోరారు. తోట అరాచకాలను న్యూడెమోక్రసీ నాయకుడు, దళిత ఐక్య పోరాట సమితి నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు వివరించారు. రాష్ట్రంలో జగన్ రాజ్యాంగం నడుస్తోందని న్యాయవాది మాదే ప్రసాదరావు అన్నారు. సమావేశంలో దళిత నేతలు సబ్బతి ఫణీశ్వరరావు, కాశి వెంకట్రావు, చీకట్ల వెంకటేశ్వరరావు, సరాకుల అబ్బులు, మోరంపూడి రాజ్‌కుమార్, కొక్కి వెంకటేశ్వరరావు, కోవ్వాడ అప్పన్నబాబు, పిట్టా రాజబాబు, విన్నకోట రాజేష్, మందపల్లి చంద్రశేఖర్, ముమ్మిడిరపు ఆదినారాయణ, కోడి చిన అప్పారావు, మలకా అప్పారావు, పెయ్యల యాకోబు, బొత్స నర సింహమూర్తి, బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కె.సాయిరాం, దళిత నేతలు పాల్గొన్నారు.

రేపు కాకినాడలో పీసీసీ చీఫ్ షర్మిల రోడ్‌షో

కాకినాడ సిటీ, ఏప్రిల్ 27: ఈనెల 29న కాకినాడలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్‌షో నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం విశాఖ నుంచి రోడ్ మార్గం గుండా బయలుదేరి ఉదయం 11 గంటలకు స్థానిక అచ్చంపేట సెంటర్‌కు చేరుకుంటారు అక్కడి నుంచి కాంగ్రెస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు వెంట రాగా సర్పవరం సెంటర్, భానుగుడి జంక్షన్, మెయిన్‌రోడ్, జగన్నాథపురం వంతెన, ఎంఎస్ఎన్ చార్టీస్ మీదుగా యానాం రోడ్‌లోని బాలయోగి విగ్రహం వరకు రోడ్‌షో జరపనున్నారు. అనుమతులను బట్టి స్థానిక భానుగుడి జంక్షన్ వద్ద గానీ, జగన్నాథపురం వంతెన వద్ద గానీ ప్రత్యేక వాహనంపై నుంచి షర్మిల ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి రోడ్ షో ముగించుకుని అక్కడి నుంచి రోడ్ మార్గం గుండా అమలాపురం, గన్నవరం చేరుకుని ప్రచార కార్యక్రమాల్లో సాయంత్రం 4 గంటల సమయంలో పోలవరం బయలుదేరి వెళ్తారు. ఈ రోడ్ షోలో పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజులతో పాటు కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు పాల్గొననున్నారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు పాండు రంగారావు మీడియాతో మాట్లాడుతూ 29న కాకినాడలో జరుగనున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్ షోలో పార్టీ నేతలు, అసెంబ్లీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయా లని కోరారు.

కీలక దశకు ఎన్నికల ప్రక్రియ చేరుకుంది

- అప్రమత్తంగా ఉండండి
- పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బాలసుబ్రహ్మణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు బాలసుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలు కీలక ఘట్టానికి చేరుకున్న దృష్ట్యా ఎన్నికల యంత్రాంగం విధి నిర్వహణలో చాలా అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.బాలసుబ్రమణ్యం ఆదేశించారు. జిల్లా ఆర్‌వో కార్యాలయంలో ఎన్నికల అధికారిణి డాక్టర్ కే.మాధవీలత ఆధ్వర్యంలో ఎన్నిల అధికారులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్‌స్టేషన్లు వాటి పరిస్థితిపై సమీక్షించారు. జిల్లాలో 21 మోడల్, రెండు యూత్, ఏడు మహిళా, రెండు దివ్యాంగ ఓటర్లు కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 23 ఎంసీసీ బృందాలు నియమించామని, ఎంసీసీ ఉల్లంఘన కింద ప్రభుత్వ ఆస్తులపై 41వేలు, ప్రైవేట్ ఆస్తులపై 4836 సంబంధించి తొలగించినట్లు తెలిపారు. సి విజిల్ యాప్ 600 కాల్స్ వచ్చాయని 457 పరిష్కారం చేశామని, కేవలం 128 సమాచార సంబంధమైనవని తెలిపారు. సువిధా ద్వారా 968 అనుమతులు పెట్టుకోగా 820 జారీ చేయగా 116 తిరస్కరించామని 32 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకి వచ్చేలా స్వీప్ కార్యక్రమం చూడాలన్నారు. పోలింగ్ రోజున ఆరుగంటలకు లైన్‌లో నిలబడిన వారి వ్యక్తి స్లిప్ ఇచ్చి వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయినందున పోటీలో ఉన్న అభ్యర్థులతో ఈనెల 30న సమావేశం నిర్వహించాలన్నారు. అనంతరం సాధారణ ఎన్నికల పరిశీలకులు కమల్‌కాంత్ సరోచ్, బలరామ్ మీనాలు మాట్లాడారు. నిఘా బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. 24/7 సీసీ కెమెరాలు పర్యవేక్షణ చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద వీడియోగ్రాఫి నిర్వహించాలన్నారు. వ్యయ పరిశీలకులు రోహిత్ నగర్, జై అవింద్, నితిన్ కురియన్‌లు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అభ్యర్థులు చేసే ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు ఆడిటింగ్ బృందానికి అందించాలన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

శ్రీమాతా కన్సల్టెన్సీ (రిజి)
కాకినాడ ఏరియాలలో ఉన్న స్వాధీన తనఖా చేయించి ఇచ్చు మీ ఇళ్లకు మీకు కావాల్సిన ఋణములు ఇప్పించబడును మరియు స్వాధీన తనఖా చేయించి ఇచ్చు ఇళ్లకు ఋణములు ఇచ్చేవారు కావలెను. సెల్: 98480 49875 AJD :186510

శ్రీమాతా మ్యారేజ్ లైన్స్ (రిజి)
SC, పద్మశాలి, కులప్రసక్తి లేని ప్రథమ, ద్వితీయ వివాహ వధూవరులకు వార్కి కావాల్సిన వధూ, వరులను చూడబడును, వరుల ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు లేక వ్యాపారాలు చేస్తున్న వారై ఉండాలి (1సం. సర్వీస్ రుసుము చార్జీ రూ.1500/- రిటర్న్ ఉండదు) కాకినాడ. సెల్: 98480 49875 AJD :186512

గ్యాస్ట్రిక్ తగ్గుటకు
పథ్యము అవసరం లేదు ఎంతటి జఠిలమైన గ్యాస్ట్రిక్-అసిడిటీ అయినా శాశ్వతంగా నివారణ అగును. సంప్రదించండి. సెల్: 9866238384 AJD :177419

PLOTS FOR SALE
కాకినాడ, వెంకట్‌నగర్‌లో W/F 500 గజాలు, మెయిన్‌రోడ్ చందన బ్రదర్స్ ఎదురుగా కమర్షియల్ కాంప్లెక్స్, కత్తిపూడి హైవేకి 10 ఎకరాలు, పెద్దాపురం గుర్రాల సెంటర్‌కి దగ్గరలో DTCP స్థలములు అమ్మకము సెల్: 95500 58067 AJD:2

కావలెను
అమలాపురంలో ప్రముఖ కన్సల్టెన్సీనందు పనిచేయుటకు Tally & GST డేటా ఎంట్రీపై అనుభవం కలిగినవారు కావలెను. 8hrs డ్యూటీ సంప్ర. సెల్: 9849725305 AJD :177423

డాబా ఇల్లు అమ్మకం
జంగారెడ్డిగూడెం సుబ్బారెడ్డి కాలనీ, ప్రతిభ కాన్వెంట్ వెనుకవీధిలో 400 చ.గ.స్థలంలో E/F రెండంతస్థుల డాబా ఇల్లు అమ్మకానికి కలదు. కాంటాక్ట్ నెం: 9441037735. Ajd:177178

4 Lines CLASSIFIED Rs.230/- Only

భారత రాజ్యాంగానికి అనుగుణంగా నడుస్తా

- క్రైస్తవులు, ముస్లిం మైనారిటీలకు అపోహలొద్దు
- భారత లౌకిక విధానమే నా లక్ష్యం
- అనపర్తి ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి


క్రిస్టియన్, మైనార్టీ సోదరుల ఆత్మీయ సమావేశంలో సమైక్యతను చాటుతున్న ఎన్డీయే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


బిక్కవోలులో ప్రచారం నిర్వహిస్తూ వృద్ధురాలికి కమలం గుర్తు చూపుతున్న నల్లమిల్లి తనయుడు మనోజ్‌రెడ్డి


గొల్లలమామిడాడలో ప్రచారం నిర్వహిస్తున్న నల్లమిల్లి కుమార్తె డాక్టర్ సనాతని

అనపర్తి, ఏప్రిల్ 27 : భారత రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకుంటానని క్రైస్తవులు, ముస్లిం మైనారిటీ సోదరులు అపోహ పడొద్దని భారత లౌకిక విధానమే తన లక్ష్యమని అనపర్తి ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలో క్రైస్తవ, ముస్లిం మైనారిటీ పెద్దలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. నా అభ్యర్థిత్వం ఖరారు కాకూడదని వైసీపీ నాయకులు పన్నిన కుట్రలను ప్రజలు గ్రహించారని తాను బీజేపీ తరఫున పోటీలో నిలవడంతో ముస్లింసోదరులను తన నుంచి దూరం చేయాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ముస్లిం మైనారిటీలు, క్రైస్తవులు, దళితులపై జరిగిన దాడులు జరిగిన దాఖలాలు లేవని 2014లో ఏర్పడిన టీడీపీ బీజేపీ పాలనలో కూడా దాడులు జరిగిన సందర్భాలు లేవని కానీ 2019 నుంచి ఎన్ని దాడులు జరిగాయో చూడాలని అన్నారు. గత 42 సంవత్సరాలుగా తమ కుటుంబం కుల మతాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూనే ఉందని తన తండ్రి హయాంలో కానీ తన హయాంలో కాని నియోజకవర్గంలో అనేక చర్చిలు, మసీదులు నిర్మాణం చేసుకున్న విషయాన్ని గ్రహించాలని అన్నారు. భారత లౌకికవాదానికి తాను కట్టుబడి ఉంటానని ఎటువంటి ఆపోహలకు గురికావద్దని ఆయన కోరారు. అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూడటం తమ కుటుంబ నైజమని ఈ విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని నా నుంచి మిమ్మల్ని ఎవరూ వేరు చేయలేరని ఆయన ఉద్ఘాటించారు.

అనపర్తి నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి ప్రచారం

- ఒక వైపు నల్లమిల్లి మరో వైపు సతీమణి మహాలక్ష్మి, కుమారుడు మనోజ్, కుమార్తె సనాతని

అనపర్తి నియోజకవర్గంలో ఎన్డియే తన ప్రచార జోరును పెంచింది. కూటమి అభ్యర్థి ఖరారు ఆలస్యం కావడం సమయం తక్కువగా ఉండటంతో అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో ప్రచార జోరు పెరిగింది. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తిలో నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి, బిక్కవోలులో నల్లమిల్లి తనయుడు మనోజ్‌రెడ్డి, పెదపూడి మండలం గొల్లలమామిడాడలో నల్లమిల్లి కుమార్తె డాక్టర్ సనాతని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వీరి ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నల్లమిల్లి విజయం కోరుతూ అనివార్య కారణాల వల్ల గుర్తు మార్పు విషయాలను వివరిస్తూ వీరు ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగి ఉన్నారని కొత్త ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని వైసీపీని త్వరలోనే ఇంటికి పంపడం ఖాయమన్నారు. అనపర్తి నియోజకవర్గంలో కూటమి విజయం సాధిస్తుందని రాజమహేంద్రవరం ఎంపీగా పురందేశ్వరిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. అదే విధంగా గ్రామాల్లో టీడీపీ జనసేన బిజెపీ శ్రేణులు ఇంటింటికి వెళ్ళి కమలం గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతూ ఏకకాలంలో ప్రచారం నిర్వహించడం విశేషం.

సింగంపల్లి, వడిశలేరులో రామకృష్ణారెడ్డి ప్రచారం

రంగంపేట: అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం రంగంపేట మండలం సింగంపల్లి, వడిశలేరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి గుర్తు కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. నల్లమిల్లి, వడిశలేరు గ్రామాల్లో రామకృష్ణారెడ్డికి గజమాలతో స్వాగతం పలికారు.

ఐస్‌క్రీం తయారీ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

- కేసులు నమోదు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలోని రెండు ఐస్‌క్రీం తయారీ యూనిట్లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. డీఎస్పీ ముత్యాలునాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీ వెంకటేశ్వరా ఫ్రోజెన్ ఫుడ్స్‌లో తనిఖీలు చేయగా ప్యాకింగ్ లైసెన్సు లేకపోవడం, అనుమతుల్లేని తూకాన్ని ఉపయోగించడం, ప్యాకింగ్ ఉత్పత్తులపై మ్యాండేటరీ డిక్లరేషన్ లేకపోవడం గుర్తించి మూడు కేసులు నమోదు చేశారు. వెనీలా ఫ్రోజెన్ డిజర్ట్, చాకోబార్ మీడియం ఫ్యాట్ ఫ్రోజెన్ డిజర్ట్ నమూనాలను సేకరించి విశ్లేషణకు ల్యాబ్‌కు పంపించారు. అలాగే సత్యసాయి ఫుడ్ ప్రోడక్ట్స్‌లో సోదాలు చేసి గడువు ముగిసిన ఆరు ఆర్టిఫీషియల్ ఫ్లేవర్ ఎమల్షన్ బాటిల్స్‌ని సీజ్ చేశారు. క్రిమిడే స్ట్రాబెర్రీ ఫ్రోజెన్ డిజర్ట్, క్రిమిడే వెనీలా ఫ్రోజెన్స్ డిజర్ట్ నమూనాలను ల్యాబ్‌కి పంపించామని డీఎస్పీ పేర్కొన్నారు. సోదాల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, భార్గవ మహేశ్, జగన్నాథరెడ్డి, నవీన్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు ఉద్యోగి అనుమానాస్పద మృతి


మృతి చెందిన విజయ్‌భార్గవ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేపరు మిల్లు ఉద్యోగి అనుమానాస్పద మృతిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జగన్నాథపురానికి చెందిన చెల్లుబోయిన విజయ్‌భార్గవ్(39) పేపరు మిల్లులో 2013 నుంచి సివిల్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. భార్యతో పేపరుమిల్లు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం కుటుం బ తగాదాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో భార్గవ్ క్వార్టరు లో ఒంటరిగా ఉంటున్నారు. శనివారం ఉద్యోగానికి వెళ్లకపోవడంతో సాయంత్రం 4గంటల ప్రాంతంలో సహోద్యోగి వచ్చి తలుపు కొట్టగా తీయలేదు. సెల్‌ఫోన్ రింగ్ బయటకు వినిపిస్తున్నా ఆన్సర్ చేయలేదు. దీంతో కిటికీలోంచి చూడగా భార్గవ్ నిర్జీవంగా కిందపడి ఉన్నాడు. ఆ సహోద్యోగి సమాచారంతో పోలీసులు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఫిట్స్, గుండె సంబంధిత వ్యాధులతో భార్గవ్ గత కొద్దికాలంగా బాధ పడుతున్నాడని.. అనారోగ్య సమస్యలవల్ల ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చ ని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

3200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

- 70లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం, నాటుసారాపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిఘా ముమ్మరం చేసి అనుమానం ఉన్న ప్రతి చోటా సోదాలు చేస్తున్నారు. ఈక్రమంలో శనివారం రాజమహేంద్రవరం రూరల్‌లోని వెంకటనగరం గ్రామ పరిధిలో గోదావరి లంకల్లో ఉన్న తూర్పు లంక, నడిమిలంకల్లో నార్త్ సెబ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ డా.ఎస్.నిక్సన్ తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. పొదల్లో పెద్ద ఎత్తున దాచిన పులియబెట్టి, బెల్లం ఊట, నాటుసారాను గుర్తించారు. 3200లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 70లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని నిక్సన్ తెలిపారు. బాధ్యుల గురించి ఆరా తీస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరిస్తూ అక్రమ మద్యం, నాటుసారాపై గట్టి నిఘా పెట్టామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఏదైనా సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.వారి వివరాలను అవసరమైతే గోప్యంగా ఉంచుతామన్నారు. సోదాల్లో మంగళగిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కూడా పాల్గొన్నారని ఆయన తెలిపారు.

రాజమండ్రి : ఊర్వశి
కాకినాడ : ఆనంద్ సినిమాస్ 4K
కాకినాడ : దేవి సినిమాస్ 4K
అమలాపురం : VPC కాంప్లెక్స్
మండపేట : విజయమహల్
పిఠాపురం : శ్రీసత్య
పెద్దాపురం : వీరభద్ర
సామర్లకోట : జయలక్ష్మి కాంప్లెక్స్
తుని : రామ
జగ్గంపేట : నాగేశ్వర
రామచంద్రపురం : అన్నపూర్ణ
రావులపాలెం : వెంకటేశ్వర
తాటిపాక : శ్రీనివాస
కొత్తపేట : సత్యచంద్ర
గోకవరం : శ్రీనివాస
ఏలేశ్వరం : జయశ్రీ
ముమ్మిడివరం : వెంకటనారాయణ
ద్రాక్షారామం : సూర్యసినీమేక్స్
నీలపల్లి : శ్రీసత్య
కిర్లంపూడి : సూర్యరామ కాంప్లెక్స్
లక్ష్మివరం : వేణుగోపాల్ కాంప్లెక్స్
జి.మామిడాడ : శ్రీనివాస
రాజానగరం : ఫార్చ్యూన్4సినిమాస్
గొల్లప్రోలు : శ్రీగోవిందమహల్
నామవరం : VS మహల్
ముమ్మిడివరం : కృష్ణ
కడియం : వెంకటసూర్య
అన్నవరం : NVR కాంప్లెక్స్
రంపచోడవరం : లలిత
రాయవరం : రాయల్‌టాకీస్
కత్తిపూడి : సత్యనారాయణ
అనపర్తి : సత్యగౌరి
సీతానగరం : గీతాబాలాజీ
చింతూరు : ఓం నవయుగ
కాకరాపల్లి : శ్రీలక్ష్మి



తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలో సామాన్లు దగ్ధం



విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన సామాన్లు

వరరామచంద్రాపురం, ఏప్రిల్ 27: విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోపలి ఎలక్ట్రికల్ వస్తువులతో పాటు సామాన్లు కూడా కాలిపోయిన సంఘటన మండలంలోని పెద్ద మట్టపల్లి పంచాయతీలోని క్రిష్టారం గ్రామంలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు శుక్రవారంరాత్రి పాయం రాముడు అనే గిజనుడు తన కుటుంబ సభ్యులతో ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌కావడంతో ఇంటిలో ఉన్న సామాన్లు ఫ్రిజ్, రైస్‌కుక్కర్, డ్రైయింగ్ టేబుల్, బియ్యం, తదితర వస్తువులతోపాటు పదివేల రూపాయల నగదు కాలిపోయాయని ఇంటి యజమాని తెలిపారు. ఆస్తి నష్టం సుమారు 50 వేల నుంచి 70 వేల వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. వీఆర్వో దినేష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ఈ ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం రెవెన్యూ అధికారులు అందజేశారు.

కూటమి ప్రభుత్వంతోనే సమస్యల పరిష్కారం

● ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీష దేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి శిరీష దేవి

రాజవొమ్మంగి ఏప్రిల్ 27: రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడితేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని రంపచోడవరం కూటమి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థిని మిరియాల శిరీష దేవి అన్నారు. రాజవొమ్మంగి జయలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో శనివారం మహిళా సదస్సు మరియు బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమాలను టీడీపీ నేతలు నిర్వహించారు. సమావేశంలో రంపచోడవరం టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థిని మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబం అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారని, ప్రస్తుత ప్రభుత్వం అనేక కారణాలు చూపి సంక్షేమ పథకాలను నిరుపేదలకు దూరం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపిస్తే, అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సంవత్సరంలో 3గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇవ్వనున్నామని శిరీష దేవి తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ ద్వారా ఐదు రూపాయలకే పేదవాళ్లకు భోజనం అందించేవారని వైసీపీ ప్రభుత్వం పేదల కడుపునింపకూడదనే ఆలోచనతోనే అన్న క్యాంటీన్‌లను తీయించేసారని అన్నారు. సమావేశంలో టీడీపీ రంపచోడవరం పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసు, మాజీ ఎమ్మెల్యే బాబు రమేష్, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్న కుమారి, బీజేపీ మహిళామోర్చ వైస్ ప్రెసిడెంట్ రోహిణి, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

● పర్యవేక్షణలో నిర్లక్ష్యంపై టెక్నికల్ అసిస్టెంట్‌కు షోకాజ్

ఎటపాక, ఏప్రిల్ 27: ఎటపాక మండలం, కృష్ణవరం పంచాయతీ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ కె.వీరేంద్రకుమార్‌పై వేటుపడింది. ఈమేరకు శనివారం డ్వామా పీడీ శివయ్య ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చినట్లు ఉపాధిహామీ ఏపీవో రాఘవయ్య తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేరే ప్రాంతాలకు చెందిన అనేకమంది బినామీ మస్తర్లు నమోదు చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి ఈక్రమంలో ఇటీవల ఉపాధి హామీ పనుల అవకతవకలపై అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి విచారణ జరిపారు. దాంతో బినామీ మస్తర్లు నమోదుచేసినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో ఉపాధిహామీ ఏపీవో రాఘవయ్య నివేదికను డ్వామా పీడీకి అందజేశారు. ఫీల్డ్‌అసిస్టెంట్‌పై చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. రూ.42 వేల నగదును రికవరీకి చర్యలు తీసుకోవాలని ఏపీవోను ఆదేశించారు. ఇదే క్రమంలో వర్క్ డిమాండ్ అంచనాలను పరిశీలించకుండా ఉపాధి పనికి వర్క్ డిమాండ్ ఇచ్చి, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన టెక్నికల్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్ జారీచేసి, వివరణ ఇవ్వాలంటూ ఆదేశించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి: ముప్వా



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

ఎటపాక, ఏప్రిల్27: రాష్ట్రంలో ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధి జరగాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్ అన్నారు. రాయనపేటలో ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిని మిరియాల శిరీషాదేవీ, అరకు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిని కొత్తపల్లి గీతను ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, టీడీపీ నాయకులు ఏపూరి వెంకన్న, బీజేపీ మండలాధ్యక్షుడు మోదుగు పెరమయ్య, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, బొల్లా ప్రసాద్, గొడేటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మోతుగూడెం, ఏప్రిల్ 27: చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వాహనాలు తనిఖీ ముమ్మరం చేశారు. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా చేశారు. పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మోతుగూడెం ఎస్‌ఐ జి.గోపాలరావు, ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

కావలెను

భద్రాచలం, చర్ల నందు గల మా గెస్ట్ హౌస్ నందు ఇంటి పని, వంట పని చేయుటకు ఏ బాదరాబందీ లేని ఆడమనిషి కావలెను. వయస్సు: 40-55 సం॥, ఆకర్షణీయమైన జీతం+వసతి+భోజనం.

సంప్ర: 99599 23161

శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం

రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా

షాపులు లైసెన్సు హక్కు [illegible] టెండరు-కం-బహిరంగ వేలం ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నగరంలో గల శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘమునకు ఈ దిగువ పట్టిక నందలి షాపులు శ్రీయుత ప్రాంతీయ సంయుక్త కమీషనరు దేవాదాయశాఖ రాజమహేంద్రవరం వారి ఆమోద ఉత్తర్వులకు లోబడి 3 సంవత్సరములు కాలమునకు అనగా 11-05-2024 నుండి 31-05-2027 వరకు లైసెన్సు హక్కుల నిమిత్తం 10-05-2024 ఉదయం 11.00 గంటలకు లాలాచెర్వు రోడ్డులో గల సంఘ కార్యాలయము నందు దేవాదాయశాఖ అధికారుల సమక్షమున లైసెన్స్ హక్కు బహిరంగ వేలం పాట జరుపబడును.

షాపులు లైసెన్సు హక్కు వివరములు

క్ర. నెం	పాట ఆస్తి వివరాలు	డోరు నెం	విస్తీర్ణం	పాట ధరావత్తు	సాల్వెన్సీ	సమయం
1	షాపు నెం.1 లాలాచెర్వు రోడ్డు	69-31-1	10x12.5	10,000/-	1,00,000/-	ఉదయం 11.00 గం.లకు
2	షాపు నెం.2 లాలాచెర్వు రోడ్డు	69-31-1	10x12.5	10,000/-	1,00,000/-	

ముఖ్య షరతులు: 1. [illegible] 2. [illegible] 3. [illegible] 4. [illegible] సాల్వెన్సీ రు.1,00,000/-లు [illegible] 5. [illegible]

రాజమహేంద్రవరం
ది. 24.04.2024

సం/- వి.వి.పళ్లంరాజు, బి.కామ్
సహాయకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి
ఫోన్ నెం:0883-2471438

నర్మదా నదీ పుష్కరాలలో యాత్రికులకు ఉచిత భోజన సదుపాయం

రాజమహేంద్రవరంకల్చరల్ ఏప్రిల్ 27: మధ్యప్రదేశ్ లోని ఓంకారేశ్వంలో మే 1వ తేదీ నుంచి 12 వరకు జరుగనున్న నర్మదానదీ పుష్కరాలను సందర్శించే యాత్రికులకు అక్కడ ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు, దేవీచౌక్ శ్రీదేవీ ఆర్యవైశ్య కల్యాణమండపం పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గట్టుపల్లి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జల్లు వరప్రసాదరావు, కమిటీ సభ్యులు పామెర్ల సత్యనారాయణ, ఓ.వెంకట్రావు తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఉదయం ఇక్కడి నుంచి మధ్యప్రదేశ్‌లోని ఆదివాసీ ధర్మశాలకు (సత్రం), నిత్యావసర వస్తువులు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాజమహేంద్రవరం నుంచి వెళ్లే పుష్కర యాత్రికులకు ఓంకారేశ్వరం బస్టాండ్ సమీపంలోని ఆదివాసీల ధర్మశాలలో వసతి, అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. రూమ్స్ కావలసినవారు టి.మల్లికార్జునరావు, సెల్: 9948363749, ఎం.భద్రరావు, సెల్.9290730122, ఎ.వి.మల్లికార్జునరావు, సెల్: 9440574764లను సంప్రదించాలని నిర్వాహక సభ్యులు కోరారు.

పాలిసెట్ పరీక్షకు 1563 మంది విద్యార్థులు హాజరు

రాజానగరం, ఏప్రిల్ 27: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయు)ప్రాంగణంలో ఏర్పాటుచేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష(ఏపీ పాలీసెట్)కు 1563 మంది విద్యార్థులు హాజరైనట్లు గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జి.రామానుజం తెలిపారు. గైట్ పాలిటెక్నిక్ కళాశాల పరీక్షా కేంద్రంలో 947 మంది విద్యార్థులకుగానూ 854 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. ఆర్.కె.బ్లాక్ పరీక్షా కేంద్రంలో 800 మంది విద్యార్థులకుగానూ 709 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ టి.రామారావు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ఎజెండా...

● టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి



వేమగిరితోట ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల

కడియం/రాజమహేంద్రవరంరూరల్ ఏప్రిల్ 27: వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో విధ్వంసం, విద్వేష పూరిత వాతావరణాన్ని సృష్టించిందని తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం రాజమహేంద్రవరంరూరల్ ఐఎల్‌టీడీ, కడియం మండలం వేమగిరి ప్రాంతాల్లో గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్, గోరంట్ల కుమార్తె కంఠమనేని శిరీషలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రతీఒక్కరికీ వివరించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ 18వ వార్డులో పర్యటిస్తుండగా టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ విధంగా ముందుకు వెళ్లాలనేది ఇప్పటి నుంచే ప్రణాళిక రచించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్‌కార్డులు, పెన్షన్లు రద్దు చేశారు. చివరికి వికలాంగుల పెన్షన్లు కూడా రద్దు చేశారు. అందరికీ న్యాయం జరిగేలా ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు. ప్రజల్లో మార్పు మొదలైంది అన్నారు. దళితవాడల్లో కూడా టీడీపీకి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. 17 పథకాలను వైసీపీ రద్దు చేసిందన్నారు. ఉద్యోగాలు కల్పించడంలో వైసీపీ వైఫల్యం చెందింది. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేశారన్నారు. నిరుద్యోగ యువతకు 3వేలు స్టైఫండ్ ఇచ్చే విధంగా నిర్ణయం చేశారని గోరంట్ల తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నామని అసెంబ్లీ గుర్తు సైకిల్‌కు, పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుకు ఓటేసి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

● వేమగిరిలో జరిగిన ప్రచార కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వెలుగుబంటి ప్రసాద్, చెల్లుబోయిన శ్రీను, వెలుగుబంటి నాని, పితాని శివరామకృష్ణ, గుత్తుల కృష్ణ, సూరపరెడ్డి జానకీరామ్, జంగా వినోద్, కొప్పిశెట్టి రాజేష్, యనమదల రాజు, కోలా శ్రీను, వాసంశెట్టి నాగబాబు, గట్టి సుబ్బారావు, జోగి చక్రవర్తి, అప్పారి అన్నవరం, అల్లంపల్లి సురేష్, దంగేటి శ్రావణ్, ఈడుపుగంటి రమేష్, పాల్గొన్నారు.

● రాజమమహేంద్రవరం ఐఎల్‌టీడీ ప్రాంతంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వాసిరెడ్డి రాంబాబు, మజ్జి పద్మ, పిల్లా తనూజ, మానుపాటి తాతారావు, చిట్టిబోయిన శ్రీనివాస్, కేతా అప్పారావు, దొమ్మేటి పూర్ణచంద్రశేఖర్, కేతా సత్తిబాబు, మార్గాని భాస్కర్, మట్టపర్తి వెంకటరమణ, కక్కుల రమేష్, బొంతు ప్రసాద్, మేడిశెట్టి నాయక్, ఏలూరి వెంకటేశ్వరరావు, మత్యేటి త్రిలోక్, మీసాల ఆనంద్, పల్లి వెంకట్రావు, కప్పల మణి, పాలిక వెంకటరమణ, పీతా వంశీకృష్ణ, పీత రాము, బొంతు కోటయ్య రంగాల కృష్ణ, ఐఎల్‌టీడీ సాయి, విర్ల సత్య, శ్రీదేవి, పెంట కుమారివర్ధిని, షేక్ అమీనా, అరుణచౌదరి, బోజి హరి, కట్టా చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.





ఐఎల్‌టీడీ సెంటర్ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న గోరంట్ల, ప్రచారంలో హారతులు ఇస్తున్న మహిళలు

ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీలను నిలదీయండి

● రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27: ఎన్నికల్లో ఓట్లకోసం వచ్చే రాజకీయ పార్టీలను ప్రజలు నిలదీయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నేరవేర్చని పాలకులను నిలదీయడానికి రాష్ట్రానికి జరిగిన అన్యాయం ప్రజలు వివరించడానికి ఈనెల 14న నెల్లూరులో చేపట్టిన జనచైతన్య యాత్ర శనివారం రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ సందర్భంగా రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు కొండ దుర్గారావు, సింగోతు నాగేందర్ రావు, ఉమ్మడి జిల్లా జిల్లా కార్యదర్శి బి రమేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జనచైతన్య యాత్ర వచ్చేనెల 5న శ్రీకాకుళం జిల్లాలో ముగుస్తుందన్నారు. నెల్లూరు జిల్లాలో తెలుగ గంగా, కండలేరు ప్రాజెక్టు నిర్వాసితులకు నేటికి పునరావాసం కల్పించలేదని, అలాగే గుంటూరు జిల్లాలో మెట్ట ప్రాంతంలో సాగుభూములకు సాగు నీరు అందించకపోగా కనీసం మంచినీరు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, కె.అంజిబాబు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి యు.సుధాకర్, బి.గంగ, కే సతీష్ , కళాకారులు రామన్న, రాకేష్, అరుంధతి, రాజేశ్వరి, నిషా పాల్గొన్నారు.

సమస్యలపై నాయకులను నిలదీయండి



జనచైతన్యయాత్రలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

గోకవరం: ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వస్తున్న పాలకపార్టీ నాయకులను పరిష్కారంకాని తమ సమస్యలపై నిలదీయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న నెల్లూరు జిల్లాలో ప్రారంభమైన ప్రజాచైతన్యయాత్ర ప్రకాశం, గుంటూరు, కృష్ణ, పశ్చిమ గోదావరిజిల్లాల నుంచి రాజమహేంద్రవరం మీదుగా శనివారం గోకవరం మండలం రంపయర్రంపాలెం చేరుకొంది. ఈసందర్భంగా ఎస్సీపేటలో ఏర్పాటుచేసిన సభలో వీరాం జనేయులు మాట్లాడుతూ నెరవేర్చలేని వాగ్దానాలు చేస్తూ ప్రజలను వంచిస్తున్న నాయకులకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బి.రమేష్, నాగేంద్ర, వల్లూరి రాజబాబు, కొండదుర్గారావు, కుంచె అంజిబాబు, పాల్గొన్నారు.

పోలవరానికి ఏడు కోట్లతో సరిపెట్టారు

● ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27: కేంద్రప్రభుత్వం సుమారు రూ.13వేల కోట్లు విడుదల చేస్తుందని పోలవరం నిర్వాసితులు ఎదురుచూసారని, అయితే కేవలం రూ.7 కోట్లు మాత్రమే విడుదలచేసి చేతులు దులుపుకుందని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారులు అయినాపురపు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభలో వైఎస్ఆర్ సీపీ మద్దతుతో ప్రతిబిల్లు పాస్ చేయించుకున్న కేంద్రం రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ కేంద్రం ఇచ్చే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి అదనంగా రూ.3లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారని ,అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క నిర్వాసిత కుటుంబానికి రూ.10లక్షలు చొప్పున ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చే విధంగా జీవో విడుదల చేసినప్పటికీ ఒక్కరికి కూడా ఈ మేరకు 10లక్షల రూపాయల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. వైఎస్ఆర్ సీఎంగా ఉండగా తక్కువ నష్టపరిహారం పొందిన రైతులకు ఎకరానికి రూ.5లక్షలు ఇస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదన్నారు. భూమిలేని ఎస్సీఎస్టీ నిర్వాసితులకు ఒక్కొక్కరికి కనీసం ఎకరం భూమి ఇవ్వాలని కొత్త భూసేకరణ చట్టం చెబుతున్నప్పటికి ప్రభుత్వం ఈమేరకు చర్యలు తీసుకోలేదన్నారు. ,మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ కులస్తులకు డి పారం పట్టా భూములు ఇళ్ల స్థలాలకు సేకరించి వారిని భూమిలేని పేదలుగా మార్చారన్నారు. జిల్లా కలెక్టర్, భూసేకరణ అధికారులు కొత్త భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించి నేరానికి పాల్పడ్డారన్నారు. పంచాయితీరాజ్ చట్టం ప్రకారం ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీలలో గ్రామ సభలు జరపాలని కానీ ప్రభుత్వం నిర్వహించలేదన్నారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిందన్నారు. ఈ సమావేశంలో ఆదివాసి మహాసభ ప్రతినిధులు అగంటి వీరభద్రారెడ్డి, కెచ్చెల అబ్బాయి రెడ్డి, యలగాడ నాగేశ్వరరావు, మద్దిపాటి సతీష్, పలివెల పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి : డీసీహెచ్ఎస్ సనత్‌కుమారి

అనపర్తి, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని విధుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి అన్నారు. శనివారం అనపర్తి ఏరియా ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రిలో ఉన్న మందుల నిల్వలను ఆమె పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డీసీహెచ్ఎస్ సనత్‌కుమారి

రేపు రాజమహేంద్రవరంలో వైఎస్ షర్మిళ సభ

▸▸ కాంగ్రెస్ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27: రాజమహేంద్రవరంలో ఈనెల 29వ తేదీ సాయంత్రం 6గంటలకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి సభ ఉందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు తెలిపారు. పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ షర్మిళారెడ్డి రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామం మీదుగా జిల్లాలోకి ప్రవేశిస్తారన్నారు. మల్లయ్యపేట, సీతంపేట, ఆర్యాంపురం నల్లచానల్ త్రీటౌన్ మీదుగా ర్యాలీగా కోటగుమ్మం వద్దకు చేరుకుని అక్కడ బహిరంగ సభకు హాజరవుతారని, అటుపై కోటిపల్లి బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. ఆయా సభల్లో కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీలు, మేనిఫెస్టోలో అంశాలపై షర్మిళారెడ్డి మాట్లాడాతారని, కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పిలుపునిచ్చారన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లు రద్దుచేస్తామంటున్నారన్నారు. అలాగు రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు బోడా వెంకట్, బాలేపల్లి మురళీధరావు, అరిగెల అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడే ఏపీ సెట్

●రాజమహేంద్రవరం రీజియన్‌లో 11 పరీక్షా కేంద్రాలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష (ఏపీసెట్)పరీక్ష ఆదివారం రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని 11 కేంద్రాలలో ఆదివారం జరుగుతుందని ఏపీ సెట్ రాజమహేంద్రవరం రీజనల్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. రాజమహేంద్రవరంలోని శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి మహిళాకళాశాల, ఎస్.కె.వి.టి. డిగ్రీకళాశాల, ఆదిత్య డిగ్రీకళాశాల, ఆదిత్య మహిళా కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోబాటు, పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల, గైట్ కళాశాల, తూర్పుగోనగూడెంలోని ఐ.ఎస్.టి.ఎస్. కళాశాల, సూరంపాలెంలోని ఆదిత్య పార్మసీ కళాశాలలతోబాటు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ 11 కేంద్రాలలో 7వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి పరిశీలకులను నియమించామన్నారు. అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ ఆదివా రం ఉదయం 8.30నిమిషాలకే పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలన్నారు. పరీక్ష ఆదివారం ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30వరకూ జరుగుతుందని అన్నారు.

టీడీపీలో చేరిన పలివెల

సీతానగరం, ఏప్రిల్ 27: శనివారం రాత్రి చినకొండేపూడి జీవీకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పలివెల వీరబాబు సుమారు 2వేల మందితో టీడీపీలో చేరారు. బొడ్డు వెంకట రమణ చౌదరి, జనసేన నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణల సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు తెలుగుదేశం నియోజక వర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణచౌదరి తెలుగుదేశం కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

కూటమి అధికారం ప్రజల భవిష్యత్‌కు బంగారు బాట

● దోచుకుని దాచుకున్న వైసీపీ ● గోదావరి ప్రక్షాళన నిధులు ఏమయ్యాయి ● రోడ్‌షోకు భారీ జనసందోహం ● వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27: ప్రజల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బంగారుబాట కావాలంటే కూటమి అధికారంలోకి రావాలని రాజమహేంద్రవరం సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం 45,46,47,48,49 డివిజన్లలో శనివారం వారు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్‌లతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోకు ప్రజలు పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి వారికి అభివాదం తెలిపారు. అభ్యర్థులు పురందేశ్వరి, ఆదిరెడ్డి శ్రీనివాస్‌లు ప్రజలను పలుకరిస్తూ రోడ్ షో చేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలకు జరిగిన మేలు ఏమీలేదన్నారు. దోచుకో, దాచుకో నినాదంతో జగన్‌పాలన సాగిందని మండిపడ్డారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమ పాలన అందిస్తామన్నారు. సుందరీకరణను అభివృద్ధి అని భ్రమ కల్పించిన ఎంపీ భరత్‌రామ్ కళ్లు తెరిపించేలా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. భరత్ రామ్ తన ఎంపీ నిధులను సక్రమంగా వినియోగించకపోగా నగరపాలక సంస్థ సాధారణ నిధులతో మన రాజమహేంద్రవరం నగరంలో అనాలోచిత పనులుచేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంతోపాటు ప్రజలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. టీడీపీ హాయంలో మంచి పాలన జరిగిందన్నారు. చంద్రబాబు పాలనలో ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందన్నారు. అటువంటి మంచి పాలన కావాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైన, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు సైకిల్ గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ గోదావరి ప్రక్షాళనకు నిధులు కేటాయిస్తే ఏం చేశారని ప్రశ్నించారు. రోడ్‌షోకు వచ్చిన భారీ జనసందోహం నడుమ వారు ప్రజలకు అభివాదం చేశారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. స్థానిక 45వ డివిజన్‌లో వైసీపీకి చెందిన విజ్జిన మధు తన అనుచరులతో టీడీపీలో చేరారు.

46వ డివిజన్‌లో బోచ్చ రమణ తన అనుచరులతో టీడీపీలో చేరారు. 49 డివిజన్‌కు చెందిన మరియమ్మ తన అనుచరులతో టీడీపీలోకి చేరారు. వారంతా సుమారు 500కుపైబడి ఉన్నారు. వారికి ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్టీ కండువాలతో పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జీలు క్యాయల రమణ, మొకమాటి సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డిమణి, జనసేన నాయకులు వై.శ్రీను, బీజేపీ నాయకులు రేలంగి శ్రీదేవి, ఓబీసీ మెర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ పాల్గొన్నారు.

●మెయిన్ రోడ్డులో మహిళలతో భారీ ర్యాలీ

రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులో శనివారం సాయంత్ర మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక డీలక్స్ సెంటర్ నుంచి ఈ ర్యాలీ మెయిన్‌రోడ్డు మీదుగా కోటగుమ్మం సెంటర్ వరకు సాగింది. మహిళలతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన నగర ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణలు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సిటీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడారు. దక్షిణ కాశీగా పిలువబడే రాజమహేంద్రవరాన్ని వైసీపీ ప్రజాప్రతినిధులు బ్లేడ్ గంజాయి బ్యాచ్, డ్రగ్స్‌కు నిలయంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దానవాయిపేట, ప్రకాశ నగర్‌లో కనీసం వ్యాపారులను సంప్రదించకుండా ఇష్టాను సారం అనాలోచిత పనులు చేశాడన్నారు. ఇటువంటి వాడిని ఇంటికి పంపించాలన్నారు. ఎంపీగా పురందేశ్వరిని ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.







జనసందోహం నడుమ ప్రచారం వాహనంలో కూటమి అభ్యర్థులు ఆదిరెడ్డి శ్రీనివాస్, దగ్గుబాటి పురందేశ్వరి, నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిరెడ్డి వాసు, మహిళలు

కాలువలో దూకిన గుర్తు తెలియని వ్యక్తి : కాపాడిన స్థానికులు


కడియం, ఏప్రిల్ 27: శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వేమగిరి కాలువలో దూకాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న కొప్పిశెట్టి జయప్రకాష్ గ్రంధిరాజు అనే వారు అతనిని కాలువలోకి దిగి కాపా డారు. అనంతరం కడియం సీహెచ్‌సీలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ వ్యక్తికి సుమారు 50 నుం చి 55 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఆ వ్యక్తి తన వివరాలు చెప్పలేక పోతున్నాడని, అయ న గురించి వివరాలు తెలిస్తే తెలియ జేయాలని కడియం పోలీసులు తెలిపారు.



కాలువలో దూకిన గుర్తు తెలియని వ్యక్తి

ఎండీయూ వాహనం స్వాధీనం

గోపాలపురం, ఏప్రిల్ 27: ఎన్నికల ప్రవర్తన నియామవళి ఉల్లంఘిస్తూ కరిచర్లగూడెం గ్రామానికి చెందిన ఎన్‌డీయూ ఎన్నికల ప్రచారంలో పాల్గొ న్నారంటూ వచ్చిన ఫిర్యాదు క్షేత్రస్థాయిలో నిర్ధారణ కావడంతో ఎన్‌డీయూ ను విధుల నుంచి తప్పించి అతనిపై ఇటీవల కేసు నమోదు చేశారు. అతనికి కేటాయించిన వాహనాన్ని అధికారులు శనివారం స్వాధీనం చేసుకుని పంచాయ తీ కార్యదర్శికి అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం.



జిల్లా ఓటర్లు
16,23,149
2024 ఎన్నికల తుది జాబితా



నువ్వు కావాలయ్యా.. నువ్వు రావాలయ్యా: కాకినాడ రూరల్‌లో పవన్ రోడ్ షో



అభిమాన పవనాలు : కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో సభకు హాజరైన జనం



రాత్రయినా తరగని అభిమానం: సామర్లకోటలో సభకు హాజరైన జనం

సమస్యలివే సార్ : పవన్‌తో మాట్లాడుతున్న పిల్లి సత్యనారాయణమూర్తి

మా గుండెల నిండా నువ్వే పవనన్నా...

కాకినాడ రూరల్ రోడ్ షోలో పవన్ అభివాదం

జన కెరటం..



కూటమికే ఓటేయండి : అభ్యర్థులు పంతం నానాజీ, ఉదయ్ శ్రీనివాస్‌లతో కలిసి పవన్ అభివాదం





తమ్మవరం రైతులకు జగన్ మోసంపై సభలో ఫ్లెక్సీ

గుర్తు పెట్టుకోండి.. మరచిపోవద్దు : పెద్దాపురంలో పవన్‌తో కలిసి గుర్తులను చూపుతున్న అభ్యర్థులు ఉదయ్‌శ్రీనివాస్, నిమ్మకాయల చినరాజప్ప

- పవన్ వారాహియాత్రకు జన సునామీ
- కాకినాడ రూరల్, సామర్లకోటల్లో సభలు
- వైసీపీ నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- కూటమిని గెలిపించాలని విన్నపం
- బాధితులకు న్యాయం చేస్తామని హామీ

సర్పవరం జంక్షన్/కాకినాడ రూరల్/పెద్దాపురం/సామర్లకోట, ఏప్రిల్ 27: 'రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన అంతం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం సొంత పార్టీ ప్రయోజనాలనే పణంగా పెట్టి, అనుభవం ఉన్న చంద్రబాబుకు మద్దతు ఇచ్చినవాడిని.. ఏ ఒక్క కులాలకో పరిమితం కాను. అన్ని కులాల ప్రయోజనాల కోసం పాటుపడతా. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి గెలిపించాలి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోరారు. కాకినాడ రూరల్ ఇంద్రపాలెం ముసలమ్మతల్లి ఆలయం వద్ద కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు(నానాజీ)ఆధ్వర్యంలో శనివారం రాత్రి వారాహి యాత్ర నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలపై తీవ్ర విమర్శలు చేశారు. డొక్కు స్కూటర్‌తో సమాచారం కావాలంటే మా ఇంటికి వచ్చే కన్నబాబు అక్రమాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడి రూ.వెయ్యి కోట్ల అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆస్తి తగాదా పేరు చెప్పి యువ డాక్టర్ ఆత్మహత్యకు కారణమైన దుర్మార్గుడు అని ఆరోపించారు.వాకలపూడిలో 20 మందికి చెందిన 4.86 ఎకరాల భూమిని కడప జిల్లాకు చెందిన రెడ్లు కొట్టేయడంలో సహకరించారన్నారు.తమ్మవరం రైతుల నుంచి ఏపీఐఐసీ సేకరించిన 298 ఎకరాల భూమిని వెనక్కి ఇప్పిస్తానని హామీ ఇచ్చి సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు రైతులను మోసగించారన్నారు. కన్నబాబు కమిషన్లు తీసుకుంటూ దందాలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం కమీషన్ కోసం కొంగోడు బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకున్న ఘనుడన్నారు. సూర్యారావుపేటలో మత్స్యకారుల ఇళ్లను ఖాళీ చేయించి తిరిగి స్థలాలివ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్ర మాలు మర్చిపోలేదన్నారు. రాష్ట్ర శ్రేయస్సు, యువత భవిష్యత్తు కోసం గాజుగ్లాసు గుర్తులపై రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా పంతం నానాజీ, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. టీడీపీకి చెందిన సీనియర్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను పవన్ ప్రశంసించారు.సభలో ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు,కె.బాబీ, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్ బొండా సూర్యారావు, కాకరపల్లి చలపతి, రాందేవు సీతయ్యదొర, పెంకే శ్రీనివాస్‌బాబా పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలన.. ఆరు పరిశ్రమల మూత

శత సంవత్సరాల చరిత్ర గల సామర్లకోట డెక్కన్ షుగర్ ఫ్యాక్టరీ, సగ్గుబియ్యం పరిశ్రమ, నాలుగు సహకార చక్కెర కర్మాగారాలు ఐదేళ్ల వైసీపీ పాలనలోనే మూతపడ్డాయని పవన్ కల్యాణ్ అన్నారు. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట పట్టణ రింగ్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాజానగరం నుంచి కాకినాడ వరకూ ఉన్న ఏడీబీ రోడ్డులో స్వయంగా ప్రయాణించి ప్రజల కష్టాలు తెలుసుకున్నానన్నారు.రానున్న కూటమి ప్రభుత్వంలో రోడ్లను అభివృద్ధి చేసే బాధ్యతను జనసేన తరఫున తాను స్వీకరిస్తానన్నారు. స్థానికంగా 100 పడకల ఆస్పత్రిని నిర్మించి మెరుగైన వైద్యం అందిస్తానన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు కలిసి 600 ఎకరాల రామేశం మెట్టను పూర్తిగా నేలమట్టం చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ప్రతి వైసీపీ నాయకుడిని రామేశంమెట్టలో మోకాలిపై నడిపిస్తామంటూ హెచ్చరించారు.పెద్దాపురం నియోజకవర్గంలో 55 ఎకరాల్లో 20,040 మందికి స్థలాలిస్తే వాటిలో 1,019 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు గోదావరి జలాలను అందిస్తామని జగన్ ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ఎస్సీలు తమ పథకాలను ఎందుకు నిలిపివేశారో నిలదీయాలన్నారు. ఎమ్మెల్సీ దళిత డ్రైవర్‌ను హతమార్చి డోర్ డెలివరీ చేస్తే దళితులు ఎందుకు వైసీపీకి ఓటు వేయాలి అని సునీల్‌ను ప్రశ్నించారు. ఓటమి పొందే పార్టీలోకి మారడం సునీల్ నైజమన్నారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం..

కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని యువతకు ఉపాధి కల్పిస్తా. కాకినాడ పోర్టును అభివృద్ధి చేస్తా. ఏడీబీ రహదారిని గుంతలమయంగా మార్చేసిన ఘనత వైసీపీదే. ఫుడ్ పార్కును గాలికొదిలేశారు. ఏఒక్క పరిశ్రమా రాలేదు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తెచ్చి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా.

ఇళ్ల పట్టాల పేరుతో పేదలకు మోసం

కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ

కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వంలో నకిలీ ఇళ్లపట్టాలిచ్చారు. స్వామినగర్‌లోఇళ్లపట్టాల పేరుతో పేదలను మోసగించారు. జయలక్ష్మి సహకార సొసైటీ స్కామ్‌లో వైసీపీ నాయకుల పాత్ర ఉంది. రూరల్‌లోని గ్రామాల్లో వైద్యం మీద ప్రత్యేక దృష్టి పెడతాం. కాకినాడ బీచ్‌ను సుందరంగా చేస్తాం.

రాష్ట్రం కోసం ఆలోచించే కూటమి

పెద్దాపురం టీడీపీ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంది. ఇది గుర్తించి కూటమిగా ఏర్పడాలని భావించిన వ్యక్తి పవన్. అందరినీ ఒప్పించి కూటమి ఏర్పాటు చేశారు. 2019లో నేను విజయం సాధించినా నన్ను పనిచేయనివ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక్క రూపాయి ఇవ్వకుండా మోసాలు చేసి సంపద దోచుకున్నారు.

పాతపాటే!

- కూటమి సూపర్ సిక్స్ ముందు తుస్సుమన్న వైసీపీ మేనిఫెస్టో
- విస్తుబోయిన నేతలు.. డీలాపడిన సొంత పార్టీ శ్రేణులు..
- ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతకు జగన్ మొండిచెయ్యి
- బీసీ, ముస్లిం, మైనారిటీల రిజర్వేషన్ల ఊసూ లేదు
- పోలవరానికి మరో అయిదేళ్లూ కావాలట
- పింఛనుదారులకు గత ఎన్నికల నాటి తంతే ఈసారీ
- 2028లో రూ.250, 2029లో రూ.250 పెంచుతామని మెలిక
- ఇప్పటికే రూ.4 వేలు పింఛను ఇస్తామని టీడీపీ కూటమి ప్రకటన
- దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని మరో అద్భుత వరం
- మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తామన్న చంద్రబాబు
- బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు.. ప్రత్యేక రక్షణ చట్టం
- పథకాలతో కూటమిలో జోష్.. మేనిఫెస్టోతో వైసీపీ కేడర్ డీలా



ఈసారి ఎన్నికల వైసీపీ మేనిఫెస్టో తుస్సుమంది. కొద్దిరోజులుగా జగన్ ప్రకటించే మేనిఫెస్టోపై రకరకాల ఊహాగానాలను ఆ పార్టీ నేతలు ప్రచారంలోకి తెచ్చారు. అభ్యర్థుల ప్రచార సమయంలో కూడా ఓటర్లకు పింఛన్లు భారీగా పెంచుతామని, యువతకు ఉద్యోగాలంటూ నేరుగా చెబుతూ వచ్చారు. తీరా మేనిఫెస్టో విడుదలైన తర్వాత ఆ పార్టీ వారికే మింగుడుపడడం లేదు. గత ఎన్నికల్లో మాదిరే ఈసారీ 'పెంచుకుంటూ పోతాం' అనే పల్లవినే జగన్ అందుకోవడం విశేషం. గత ఎన్నికల సమయంలో పింఛన్ల ప్రకటనలో కూడా ఇదే గందరగోళం సృష్టించారు. పెంచుకుంటూ పోతామనే దానికి అర్థం ఏమిటో పింఛనుదార్లకు తర్వాతగానీ బోధపడలేదు. ఈసారీ అదే పల్లవి అందుకోవడంతో గత హామీ అమలును గుర్తుచేస్తున్నారు. కొత్తగా వైసీపీ మేనిఫెస్టోలో ఏ పథకాలు లేకపోగా, టీడీపీ ఏడాదికాలం కింద ప్రకటించిన సూపర్ సిక్స్ పేరిట జనం నోళ్లలో నానుతున్న పథకాలతో పోల్చి మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా పింఛన్ల పెంపు, 20 లక్షల ఉద్యోగాల కల్పన, మహాశక్తి పథకాలపై చర్చ జరుగుతోంది.



(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఈసారి మేనిఫెస్టో రూపకల్పనలోనే వైసీపీ బోల్తాపడింది. ప్రజలకు కొత్తగా ఒక హామీ కూడా ఇవ్వలేకపోయారు. దీంతో ఎన్నో ఊహాగానాలు అల్లుకున్న ఆ పార్టీ కేడర్ సైతం డీలా పడిపోయింది. శనివారం ప్రకటించిన వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టో ముందు బోల్తాపడింది. గతంలోని పథకాలకే కొన్ని రంగులు పులిమి, నవరత్నాలు పేరిట ఉన్న పథకాలనే కొనసాగిస్తామని చెబుతూ రెండు పేజీలతో సరిపెట్టారు. నిజానికి ఆనాటి హామీలు కూడా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. అలాగే ఆయా పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను కుదించి, అరకొరగా అమలుచేశారు. దీంతో అర్హులెందరికో లబ్ధి చేకూరలేదు. ఆదిలోనే పింఛను విషయంలో బురిడీ కొట్టించిన వైనాన్ని పలువురు గుర్తుచేస్తున్నారు. మూడు వేల పింఛను ఇస్తామని.. ఏడాదికి రూ.250 ఇవ్వడంపై లబ్ధిదారులు ఇప్పటికే గుర్రుగా ఉన్నారు. ప్రస్తుత మేనిఫెస్టోలో కూడా ఇదే పాట పాడగా, రూ.500 మాత్రమే పెంచి అది కూడా చివరి రెండు ఏళ్లలో పెంచుతామని మెలిక పెట్టారు. అంటే పెన్షన్ల సొమ్ము ఈ ఏడాది పెంచరట. వచ్చే ఏడాది 2025లో పెంచరు. 2026, 2027లోనూ పెంచరు. ఎన్నికల చివరి ఏడాది అంటే 2028లో రూ.250, ఎన్నికల ఏడాది 2029లో రూ.250 పెంచి మొత్తం రూ.3,500 చేస్తారట. ఈ ప్రకటన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీల కింద పెన్షన్ పొందుతున్న వారిలో తీవ్ర ఆవేదన మిగిల్చింది. ఆగ్రహానికి గురిచేసింది. దివ్యాంగులకు వైసీపీ పాలనలో తీరని అన్యాయం చేశారు. వారికి ఒక్క రూపాయి కూడా పెంచలేదు. ఇప్పుడూ వారి మాట మరిచారు. ఇక టీడీపీ ఏడాది కిందటే సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు అనేక వరాలిచ్చింది. ఇప్పుడు కూటమి తరఫున కూడా ఈ పథకాలను ఇస్తామంటూ చంద్రబాబు, పవన్ భరోసా ఇచ్చారు. అందులో నెలకు రూ.4 వేల పింఛన్.. అది కూడా ఏప్రిల్ నుంచే లెక్కకట్టి, జూలై నెలలో ఏకంగా ఏడు వేలు ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. దివ్యాంగులకు నెలకు రూ.ఆరు వేలు ఇస్తానని స్పష్టంచేశారు. ఇక వైసీపీ అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించింది. దీంతో వేలాది మంది బీసీలు స్థానిక సంస్థల్లో పదవులు కోల్పోయారు. కానీ జగన్ మేనిఫెస్టోలో ఆ ఊసే లేదు. టీడీపీ కూటమి మాత్రం బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతామని స్పష్టంచేసింది. అలాగే బీసీలకు కూడా రక్షణ చట్టం తీసుకొస్తామని సూపర్ సిక్స్‌లో ప్రకటించారు. బీసీ రిజర్వేషన్లు, బీసీ రక్షణ చట్టంపై ప్రధానంగా ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక మహిళల విషయంలో కూడా పాతపాటే. ఎంతో చేశానని, అదే మళ్లీ చేసేస్తానని జగన్ చెప్పారు. ఇది కూడా మహిళల్లో మరింత అసంతృప్తిని రేపింది. బటన్ నొక్కిన కొన్ని నెలలకు కొంత జమ చేస్తూ ఈ ఐదేళ్లు మహిళలను ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. ఇవాళ టీడీపీ కూటమి మహిళలకు మహాశక్తి పథకం అమలుచేయనుంది. ఆడబిడ్డ నిధి కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది మహిళలకు నెలకు రూ.1500 ఇస్తారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు వారికి ఏడాదికి రూ.15వేల వంతున ఇస్తామని ప్రకటించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రకటించింది. ఇక రైతులకు ఏడాది రూ.20 వేలు పంట పెట్టుబడికి ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఇలా అన్నివర్గాల సంక్షేమంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనే కూటమి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఇవాళ జగనన్న ఇళ్లు పేరిట కేవలం సెంటు భూమి పనికిరాని భూముల్లో ఇవ్వగా, తాము 3 సెంట్ల భూమి ఇచ్చి.. ఇల్లు మంజూరు చేస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. 2019కే పూర్తి కావలసిన పోలవరాన్ని ఐదేళ్లలో గాలికి వదిలేసిన జగన్, దీని నిర్మాణానికి మరో ఐదేళ్లు కావాలని మేనిఫెస్టోలో పెట్టడాన్ని జనం ఆక్షేపిస్తున్నారు. తిరకాసు, మోసపూరిత హామీలతో బురిడీ కొట్టించాలని చూస్తే.. జనం నమ్మరని జగన్ మేనిఫెస్టోపై పలువురు వ్యాఖ్యానించారు.

ఒరిగేదేం లేదు...



వైసీపీ మేనిఫెస్టో నిరాశపరిచింది. దీనివల్ల ప్రజలకు కొత్తగా ఒరిగేది ఏం లేదు. అవ్వాతాతలకు రూ.4 వేల పింఛను ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. సూపర్ సిక్స్ పథకాలు అందరికీ మేలు చేకూరుస్తాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి నెలా ఆర్థిక చేయూత ఇస్తామని బాబు హామీ ఇచ్చారు.

- కరుటూరి విశ్వేశ్వరి, అంకంపాలెం

చంద్రబాబు హయాంలోనే బాగు



ప్రతీ ఇంటికీ పింఛన్, ఇల్లు, రేషన్‌కార్డులు వంటి పథకాలు చంద్రబాబు ప్రభుత్వం హయాంలో కూడా అమలుచేశారు. కొత్తగా జగన్ ప్రభుత్వంలో ఒరగబెట్టింది లేదు.

- సత్యవతి, సామర్లకోట

అంతా మోసమే..



ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ గత ఎన్నికల మేనిఫెస్టోలో 95 శాతం పూర్తి చేశానని చెప్పి ప్రజల్ని మోసం చేశారు. యువకులు నిరుద్యోగంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రజలకు ఏదీ అందలేదు.

- సత్తిరాజు ఆదిత్యకిరణ్, కొత్తపేట

వై.. చీప్ రాజకీయం!





పిఠాపురంలో పట్టుబడిన మద్యం (ఫైల్)

- ఎన్నికల వేళ.. వైసీపీ మద్యం స్కీమ్
- గోవా నుంచి గోదావరికి అక్రమ మద్యం
- భారీగా కంటెయినర్లలో డంప్
- లోకల్‌గానూ తయారీ
- అన్ని నియోజకవర్గాలకు సరఫరా
- పిఠాపురం,కాకినాడల్లో పట్టివేత
- తూతూ మంత్రంగా కేసులు

పిఠాపురం, ఏప్రిల్ 27: వైసీపీ నాయకులా మజాకానా.. టక్కు టమార విద్యల్లో ఆరితేరిన వారు.. అందుకే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చీపు రాజకీయానికి తెరలేపుతున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీగా మద్యం నిల్వలు తెచ్చి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిల్వ చేస్తోంది. గోవా మద్యంతో పాటు రాష్ట్రంలోనూ తయారు చేసి అవే లేబుల్స్ ఉన్న సీసాల్లో నింపుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటికే కాకినాడ, పిఠాపురంలలో భారీగా మద్యం డంప్‌లు బయట పడ్డాయి. విలువ రూ.1.50 కోట్లకు పైగా ఉంది. ఇంతకు వంద రెట్లు అధికంగా కాకినాడ జిల్లాకు మద్యం నిల్వలు చేరినట్టు సమాచారం.

బరితెగించిన వైసీపీ నేతలు..

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగియకుండానే జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. వైసీపీ నేతలు బరితెగించి భారీగా మద్యం పంపిణీ చేస్తున్నారు. గోవా నుంచి కంటెయినర్ల ద్వారా మద్యం జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నట్టు సమాచారం. అంతే కాకుండా గోవా మద్యం సీసాల్లో రాష్ట్రంలోని రెండు ఫ్యాక్టరీల్లో తయారైన మద్యాన్ని నింపి ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్టు సమాచారం. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంతో పాటు కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజవర్గాలకు ఇప్పటికే భారీ మద్యం నిల్వలు చేరాయి. ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.5 నుంచి రూ.పది కోట్లు విలువైన మద్యాన్ని చేర్చినట్టు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమంగా తీసుకువచ్చినట్టు చెబుతున్నారు.

పట్టుబడిన మద్యం బ్రాండ్లు ఇవే



పిఠాపురం నియోజకవర్గంలో జరిగిన దాడుల్లో పట్టుబడిన మద్యం బ్రాండ్లు అన్నీ గోవా తయారీ మద్యం బ్రాండ్లుగా చెబుతున్నారు. ఇవన్నీ ఎన్‌డీపీఎల్ లిక్కర్ కావడంతో కేసు తీవ్రత అధికంగా ఉంటుంది. పట్టుబడిన వాటిలో రాయల్ బ్లూ, గోవా కిక్ విస్కీ, బొంబాయి సెంట్రల్ క్లాసిక్ టోటల్ విస్కీ, గోవా క్విక్ ఫైనెస్ట్ సుపీరియర్ విస్కీ,యూకే నెంబరు 1 రేర్ విస్కీ, రాయల్ స్టైల్ విస్కీ, గోవా విస్కీ బ్రాండ్లు ఉన్నాయి.ఇప్పుడు ఇవి ఎక్కడ తయారయ్యాయి, వీటిని ఎలా తరలించారు, ఎవరు తరలించమన్నారు తదితర విషయాలపై దర్యాప్తు చేయాల్సిన పోలీసు,సెబ్ అధికారులు అసలు విషయాన్ని వదిలి తూతూమంత్రంగా నాలుగుచోట్ల ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేసినట్టు చెబుతున్నారు. ఇప్పటికే ఇంత భారీగా మద్యం నియోజకవర్గాలకు తరలించిన వైసీపీ రానున్న రోజుల్లో ఇక ఎన్ని కుట్రలకు తెరలేపుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ కీలక నేతల ఫ్యాక్టరీల్లోనే..

ఈ అక్రమ మద్యం వ్యవహారంలో రాష్ట్రానికి చెందిన వైసీపీ ఎంపీలుగా ఉన్న ఇద్దరు నేతలు, కాకినాడ జిల్లా కేంద్రం కీలక నేత ఒకరు కీలకపాత్ర పోషించినట్టు చెబుతున్నారు. ఆ ఇద్దరు ఎంపీలకు లిక్కర్ తయారీ యూనిట్లు ఉండడంతో అక్కడ ఈ మద్యాన్ని తయారు చేయించి గోవా బ్రాండ్ల స్టిక్కర్లు అంటించి ఉన్న సీసాల్లోకి నింపినట్టు చెబుతున్నారు. గోవా మద్యంతో పాటు అంతకు రెండింతలు లోకల్ మద్యం వివిధ ప్రాంతాలకు డంప్ చేసినట్టు చెబుతున్నారు. పిఠాపురం పట్టణంలోని మూడు చోట్ల, కుమారపురంలో ఒక చోట గృహాల్లో డంప్‌లపై ఎస్ఈబీ, పోలీసు అధికారులు దాడులు చేశారు. ఇక్కడ ఏకంగా 52,992 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.కోటి పైగా ఉంటుందని అంచనా. కాకినాడలోనూ మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ రూ.50 లక్షలు ఉంటుంది.రెండు చోట్ల పట్టుబడిన మద్యం చాలా తక్కువని, ఇంతకు వంద రెట్లు నిల్వలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

ఓటర్లను మద్యంతో ముంచెత్తడమే లక్ష్యంగా

ఓటర్లను మద్యం మత్తులో ముంచేయాలని వైసీపీ నేతలు ముందు నుంచీ భావిస్తున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాలో మద్యం పంపిణీ ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రతి రోజు మద్యం పంపిణీ చేయాలని, పోలింగ్ చివరి ఐదు రోజులు ప్రజలు కోరినంత మద్యం పంపిణీ చేయాలని వైసీపీ పెద్దలు నియోజకవర్గాల నేతలకు చెప్పినట్టు సమాచారం.పిఠాపురంలో పవన్‌ను ఓడించాలనే లక్ష్యంతో ఉన్న వైసీపీ అధినాయకత్వం అక్కడ మద్యాన్ని ఏరులై పారించాలని పన్నాగం పన్నినట్టు ఇతర పార్టీల అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కాకినాడ, పిఠాపురంలలో మద్యం నిల్వలు పట్టుబడిన నేపథ్యంలో రెండు, మూడు రోజుల పాటు లిక్కర్ పంపిణీకి వైసీపీ నేతలు తాత్కాలికంగా ఫులిస్టాప్ పెట్టారు. అంతే కాకుండా వైసీపీ నేతలు తమ మద్యం నిల్వలను దూర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. సెబ్, పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తే మరింత భారీగా నిల్వలు బయటపడతాయని అందరు భావిస్తున్నా ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

సీఎం జగన్‌వి శవ రాజకీయాలు

టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 27: వృద్ధులు, దివ్యాంగులకు ఏప్రిల్ నెలలో సీఎం జగన్ పింఛను పంపిణీని ఆలస్యం చేసి శవ రాజకీయాలకు దిగజారారని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య జగన్‌రెడ్డి తన సొంత కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయించారన్నారు. అవ్వతాతల్ని ఎండలో తిప్పి ఎవరైనా చనిపోతే దాన్ని విపక్షాలికి అంటగట్టి శవ రాజకీయం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని జగన్ యత్నించారన్నారు. రాష్ట్రంలో ధరల బాదుడు, ప్రభుత్వ నిధుల లూటీ, వివేక హత్యకేసులో తాడేపల్లి కుట్రల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే పింఛన్ల పంపిణీపై కుట్ర చేశారన్నారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, గొర్రెల శ్రీధర్, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

జూలైలో రూ.7 వేలు పింఛన్

టీడీపీ-జనసేన-బీజేపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి



నల్లజర్ల, ఏప్రిల్ 27: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఈ నెలలో పింఛన్ అందించే క్రమంలో కావాలనే జాప్యం చేసి శవరాజకీయాలకు జగన్ తెర తీశారని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం నల్లజర్లలో టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మే 1వ తేదీన పింఛన్ ఇంటి వద్దనే పంపిణీ చేయకపోతే దానికి సీఎం జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పింఛన్ నిధులు అట్టిపెట్టకుండా మార్చి 16నుంచి 30 తేదీల మధ్య రూ.13 వేల కోట్ల నిధులు తన సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టి పింఛన్‌లకు నిధుల కొరత కలుగజేసి ఆ నిందను టీడీపీ అధినేత చంద్రబాబుపైకి నెట్టే ప్రయత్నం చేసి విఫలమైనట్టు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జూలై నెలలో రూ.7 వేలు పింఛన్ అందించి ప్రతి నెల రూ.4 వేలు పింఛన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో పసుమర్తి రతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, కండెపు వెంకటరత్నం, యలమాటి శ్రీనివాసరావు, నిమ్మలపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎండీయూ వాహనం స్వాధీనం

గోపాలపురం, ఏప్రిల్ 27: ఎన్నికల ప్రవర్తన నియామవళి ఉల్లంఘిస్తూ కరిచర్లగూడెం గ్రామానికి చెందిన ఎన్‌డీయూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారంటూ వచ్చిన ఫిర్యాదు క్షేత్రస్థాయిలో నిర్ధారణ కావడంతో ఎన్‌డీయూను విధుల నుంచి తప్పించి అతనిపై ఇటీవల కేసు నమోదు చేశారు. అయితే అతనికి కేటాయించిన వాహనాన్ని అధికారులు శనివారం స్వాధీనం చేసుకుని పంచాయతీ కార్యదర్శికి అప్పగించినట్టు విశ్వసనీయ సమాచారం.

బైక్ డివైడర్‌ను ఢీకొని కుమార్తె మృతి

తండ్రికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్

నల్లజర్ల, ఏప్రిల్ 27: మండలంలోని దూబచర్లలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొయ్యలగూడెం మండలం కుంటలగూడెం గ్రామానికి చెందిన కోమటి హర్షిణి(అమ్ములు)(8)అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ టీవీ సురేష్ తెలిపారు. కుంటలగూడేనికి చెందిన ఆటో డ్రైవర్ కోమటి సురేష్, భార్య కృష్ణవేణి, పెద్ద కుమార్తె అయ్యవరంలో నివాసం ఉంటున్నారు. శనివారం స్వగ్రామంలో వివాహ వేడుకకు హాజరై తమ అమ్మ పద్మ వద్ద ఉంటున్న సురేష్ చిన్నకుమార్తె హర్షిణిని అయ్యవరం తీసుకుని వెళ్లేందుకు బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరారు. దూబచర్ల సర్వీస్ రోడ్డులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షిణి అక్కడికక్కడే మృతి చెందగా సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ఆసుపత్రికి తరలించారు. సురేష్ పరిస్థితి విషమంగా ఉందని బంధువు రాక్షస గిరి తెలిపారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

తాడిపర్రులో బీజేపీ నాయకుల ప్రచారం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 27: బీజేపీతోనే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని రాజమండ్రి పార్లమెంట్ కన్వీనర్ కె.కృష్ణభగవాన్ అన్నారు. శనివారం మండలంలోని తాడిపర్రు తదితర గ్రామాల్లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపర్రులో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీయే మరలా కేంద్రం లో వస్తుందని, మోదీ నాయకత్వంతో దేశం అభివృద్ధిలో మరింత ముందుకు వెళుతుందని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం కృష్ణభగవాన్‌ను సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పలివెల

సీతానగరం, ఏప్రిల్ 27: సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పలివెల వీరబాబు సుమారు 2వేల మందితో టీడీపీలో చేరారు. శనివారం రాత్రి చినకొండేపూడి జీవీకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన నాయకుడు ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు వారిద్దరూ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పాలిసెట్ పరీక్షకు 1563 మంది హాజరు

రాజానగరం, ఏప్రిల్ 27: గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)ప్రాంగణంలో ఏర్పాటుచేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష(ఏపీ పాలీసెట్)కు 1563 మంది విద్యార్థులు హాజరైనట్టు గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జి.రామానుజం తెలిపారు. గైట్ పాలిటెక్నిక్ కళాశాల పరీక్షా కేంద్రంలో 947 మందికి గాను 854 మంది పరీక్షకు హాజరైనట్టు చెప్పారు. ఆర్‌కే బ్లాక్ పరీక్షా కేంద్రంలో 800 మంది విద్యార్థులకుగానూ 709 మంది విద్యార్థులు హాజరైనట్టు పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ టి.రామారావు తెలిపారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- ఎస్ఈబీ విజయవాడ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య
- దేవరపల్లి, నిడదవోలు స్టేషన్లు తనిఖీ



నిడదవోలులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈబీ డీసీ శంకరయ్య

దేవరపల్లి/నిడదవోలు ఏప్రిల్ 27: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద గస్తీ ముమ్మరం చేయాలని ఎస్ఈబీ విజయవాడ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య అన్నారు. దేవరపల్లి, నిడదవోలులో ఎస్ఈబీ స్టేషన్లను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలులో ఉన్నందున అధికారులు అప్రమత్తతో విధులు నిర్వహించాలన్నారు. అక్రమ మద్యం, సారా పై నిఘా పెట్టి కేసు నమోదు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదని సారా తయారీ, అమ్మకం, బెల్టుషాపుల అమ్మకాలు నిరోధించే విధంగా పనిచేయాలన్నారు. అనంతరం స్టేషన్లలో కేసులు నమోదు చేసిన ఫైల్‌ను, సీజ్ చేసిన మద్యంసీసాలు, వాహనాల వివరాలతోపాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట సీఐ స్వామి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.వీరబ్రహ్మం, ఎస్ఐలు సుధీర్, దొరబాబు, సిబ్బంది ఉన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గోపాలపురం మండలం నందిగూడెంలో 30లీటర్ల సారాను, బుచ్చియ్యపాలెంలో 30లీటర్ల సారాను మోటార్‌సైకిల్‌పై తరలిస్తుండగా ఎస్ఈబీ సిబ్బంది పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ స్వామి తెలిపారు.

కూటమి అభ్యర్థులకు మద్దతు పలకాలి

- ఎమ్మార్పీఎస్ ఉత్తర కోస్తా ఇన్‌చార్జి చిన్న సుబ్బారావు



ఐక్యత అభివాదం చేస్తున్న చినసుబ్బారావు, అచ్చిబాబు, నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 27: రాష్ట్రంలో పరిపాలన మారాలని, దానికి అన్నివర్గాల ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలియజేయాలని ఉత్తర కోస్తా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు అన్నారు. శనివారం టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్నిలను కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చిన్న సుబ్బారావు మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత దళితుల్లో 59 ఉప కులాలకు సంబంధించి అమలులో ఉన్న 27 పథకాలను రద్దు చేసి అన్యాయం చేశారన్నారు. విదేశీ విద్యకు అంబేద్కర్ పేరును తొలగించి జగన్మోహనరెడ్డి పేరు పెట్టుకోవడం చాలా దురదృష్టకరమన్నారు. విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయాల్లో తమ వంతు వాటాను రద్దు చేశారన్నారు. జగన్మోహనరెడ్డి ఏకపక్ష నిర్ణయాలకు దళితులంతా ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో పాలన మారాలని, అందుకు అన్ని సామాజికవర్గాలు కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలవాలన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు సంక్షేమ పథకాలు అందాలంటే కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ నాయకత్వంలో చంద్రబాబు అధికారంలోకి రావాలన్నారు. కొవ్వూరులో ముప్పిడి వెంకటేశ్వరరావు విజయానికి పాటుపడతామన్నారు. మాదిగ, మాల కులాలకు మేలు జరగాలని ప్రతి గ్రామం తిరుగుతున్నామన్నారు. కార్యక్రమంలో గెడ్డం వినోద్, ముప్పిడి డానియేలు, కొక్కిరిపాటి వెంకటేష్, మనెల్లి నాని, వరిగేటి కాంతరాజు, కొక్కిరిపాటి శ్రీహరి, పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

వైసీపీకి వీడ్కోలు పలికేందుకు ప్రజలు సిద్ధం

- మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి
- కూటమి అభ్యర్థులకు మద్దతుగా నాయకుల ప్రచారం

నిడదవోలు, ఏప్రిల్ 27: ప్రజా వ్యతిరేక పాలన చేసిన వైసీపీకి వీడ్కోలు పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి అన్నారు. శనివారం నిడదవోలు పట్టణ, మండల గ్రామాల్లోను జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న సీతారామలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలోకి రానుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్‌కు గాజుగ్లాసు గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భోగవల్లి ప్రసాద్, రంగా రమేష్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో టీడీపీ నాయకుడు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కందుల దుర్గేష్ కుమార్తె రంగప్రియ స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాసు, కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుదప చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్ళపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో అన్నమరెడ్డి సత్తిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, ఇల్లూరి బాబ్జీ, అన్నమరెడ్డి రమణ, అల్లూరి రాంబాబు, పామర్తి పవన్‌కుమార్, ఏసులంక తాతారావు, వడ్డి ప్రేమ్‌కుమార్, రాయుడు మధుబాబు, పాలకుర్తి వంశి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక అశోక్‌నగర్‌లో కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ పథకాలను వివరించారు. పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి...



సమిశ్రగూడెంలో దుర్గేష్ ఎన్నికల ప్రచారం



చిడిపిలో ప్రచారం చేస్తున్న పెండ్యాల అచ్చిబాబు

ఎమ్మెల్యే అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావును, ఎంపీ అభ్యర్థిగా పురందరేశ్వరిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, కొఠారు అశోక్‌బాబా, కేతా సాహెబ్, రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ, తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొవ్వూరు: మండలంలోని చిడిపి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు.. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ముప్పిడి మాట్లాడుతూ ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన జగన్మోహనరెడ్డికి ఎన్నికల్లో ఓటు ద్వారా బటన్ నొక్కి బుద్ధి చెప్పాలన్నారు. అచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఈ ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి విజయం సాధించాలన్నారు. అలాగే తాళ్లపూడి మండలం ప్రక్కిలంక పంచాయతీ వార్డు మెంబర్లు పెంటా భద్రమ్మ, దేవరపల్లి శ్రీను, వీరవల్లి వీరన్న, జుట్టా కోటియ్య తదితరులతో అచ్చిబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి టీడీపీ కండువాలు కప్పారు. కార్యక్రమాల్లో పాలడుగుల లక్ష్మణరావు, మంకెన రామారావు, మంకెన వీర్రాజు, పి.సూర్యారావు, ఎం.రామకృష్ణ, రాంబాబు, పాలడుగుల మౌళి, రమేష్, మురళీ, సతీష్, తాతారావు, నాగేశ్వరరావు, గొర్రెల శ్రీధర్, నామాన పరమేష్, కొప్పాక కొట్నీస్ పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ, మినీ మ్యానిఫెస్టో పథకాలను వివరించారు. కొవ్వూరులోని 10,11 వార్డుల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను, మోసపూరిత హామీలను వివరించారు. కార్యక్రమంలో సూరపనేని, రాజాన శ్రీనివాస్, పెనమాక జయరాజు, మడిచర్ల రామచంద్రరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 16,23,149 మంది

- పురుషులు-7,92,317,మహిళలు-8,30,735, థర్డ్ జెండర్-97
- రాజమహేంద్రవరం రూరల్ అత్యధికం, కొవ్వూరు అత్యల్పం
- తుది జాబితా ప్రకటించిన జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మే నెల 13న జరిగే పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకునే అర్హత సాధించిన ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శనివారం రాత్రి ప్రకటించారు. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 16,23,149 మంది. పురుషులు-7,92,317మంది, మహిళలు-8,30,735 మంది ఉండగా థర్డ్ జండర్ 97మందిగా నమోదయ్యారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 38,418మంది ఎక్కువగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ ఉన్నారు. ఇక జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా రాజమహేంద్రవరం రూరల్ నమోదైంది. అక్కడ 2,72,826 మంది ఉండగా అందులో మహిళలు 1,39,561మంది ఉండగా, పురుషులు 1,33241 మంది ఉన్నారు. థర్డ్ జండర్ 24మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు. ఇక్కడ మొత్తం ఓటర్లు 1,84,136మంది, పురుషులు 89,743మంది, మహిళలు 94,388మంది, థర్డ్ జెండర్ 5మంది ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఓటర్ల సంఖ్య పరంగా రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2,67,484మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 1,38695మంది ఉండగా, పురుషులు 128,739మంది, థర్డ్ జెండర్లు 50మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గం ఓటర్ల పరంగా మూడో స్థానం ఉంది. ఇక్కడ 2,42,763మంది ఉండగా, పురుషులు 1,18,965మంది, మహిళలు 1,23,793 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ 5 ఉన్నారు. అనపర్తి నాల్గో స్థానంలో ఉంది. ఇక్కడ 2,26,053మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 110,515, మహిళలు 115535, థర్డ్ జెండర్ ముగ్గురు ఉన్నారు. రాజానగరం ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 216,491 మంది. అందులో పురుషులు 106879మంది, మహిళలు 109606మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఆరుగురు ఉన్నారు. నిడదవోలు ఆరో స్థానంలో ఉంది. ఇక్కడ మొత్తం 213,396మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 104235, మహిళలు 109157మంది ఉన్నారు. థర్డ్ జెండరు నలుగురు ఉన్నారని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకున్నాం
- పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బాలసుబ్రహ్మణ్యం
- ఎన్నికల అధికారులతో విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో ఎన్నికల పరిశీలకులు బాలసుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలు కీలక ఘట్టానికి చేరుకున్న దృష్ట్యా ఎన్నికల యంత్రాంగం విధి నిర్వహణలో చాలా అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.బాలసుబ్రహ్మణ్యం ఆదేశించారు. జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత ఆధ్వర్యంలో ఎన్నిల అధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ స్టేషన్లు వాటి పరిస్థితిపై సమీక్షించారు. జిల్లాలో 21 మోడల్, రెండు యూత్, ఏడు మహిళ, రెండు దివ్యాంగ ఓటర్ల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 23 ఎంసీసీ బృందాలు నియమించామని, ఎంసీసీ ఉల్లంఘన కింద ప్రభుత్వ ఆస్తులపై 41వేలు, ప్రైవేట్ ఆస్తులపై 4836 సంబంధించి తొలగించినట్టు తెలిపారు. సి విజిల్ యాప్‌కు 600 కాల్స్ వచ్చాయని, 457 పరిష్కారం చేశామని, కేవలం 128 సమాచార సంబంధమైనవని చెప్పారు. సువిధ ద్వారా 968 అనుమతులు పెట్టుకోగా 820 జారీ చేయగా 116 తిరస్కరించగా 32 పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకి వచ్చేలా స్వీప్ కార్యక్రమం చేపట్టాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం 6గంటలకు లైన్‌లో నిలబడిన వారికి ఓటర్ స్లిప్ ఇచ్చి వారందరూ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయినందున పోటీలో ఉన్న అభ్యర్థులతో ఈ నెల 30న సమావేశం నిర్వహించాలన్నారు. అనంతరం సాధారణ ఎన్నికల పరిశీలకులు కమల్‌కాంత్ సరోచ్, బలరామ్ మీనా మాట్లాడారు. నిఘా బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. 24/7 సీసీ కెమేరాలు పర్యవేక్షణ చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద వీడియోగ్రఫీ నిర్వహించాలన్నారు. వ్యయ పరిశీలకులు రోహిత్‌నగర్, జై అరవింద్, నితిన్ కురియన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అభ్యర్థులు చేసే ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు ఆడిటింగ్ బృందానికి అందించాలని సూచించారు.

అమలుకు నోచుకోని హామీలు

- ప్రగతి పట్టాలెక్కని నిడదవోలు నియోజకవర్గం
- ఆర్టీసీ డిపో అభివృద్ధికి మంజూరు కాని నిధులు
- విజ్జేశ్వరం-సిద్ధాంతం ఏటిగట్టు పనులేమయ్యాయి?
- అడుగు ముందుకు పడని ప్రభుత్వాసుపత్రి పనులు



సీఎం జగన్ హామీ ఇచ్చినా అభివృద్ధి చెందని నిడదవోలు ఆర్టీసీ డిపో

నిడదవోలు, ఏప్రిల్ 27: సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రజా సభలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోక గాలి మాటలుగానే మిగిలిపోయాయి. నిడదవోలు పట్టణంలో జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీలతో నిడదవోలు అభివృద్ధి పథంలోకి దూసుకుపోతుందని భావించారు. కాని హామీలు అమలుకు కాకపోవడం వైసీపీ ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనంగా నిలిచిందంటూ ప్రజలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన నిడదవోలులోని ఆర్టీసీ డిపో అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఇప్పటి వరకు అభివృద్ధి సంగతి దేవుడెరుగు కొత్తగా ఒక బస్సు కూడా మంజూరు కాలేదు. ఉన్న బస్సుల్లోనే కొన్ని రూట్లను రద్దు చేసి ఆర్టీసీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనంగా నిలిచింది. బలహీన వర్గాల వారు రాకపోకలు సాగించే ఆర్టీసీ అభివృద్ధికి నిధులు ఎక్కడంటూ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం వైపు చూస్తున్నారు. అలాగే నిడదవోలు మండలం విజ్జేశ్వరం నుంచి పెరవలి మండలం సిద్ధాంతం వరకు ఏటిగట్టు అభివృద్ధికి రూ.60 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించిన సీఎం జగన్ మాటలు ఉత్తుత్తి హామీగానే మిగిలిపోయింది. మరో పక్క 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి అభివృద్ధి చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు హడావిడిగా ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తూ శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. శిలాఫలకమే మిగిలింది తప్ప నేటికి అడుగు పనులు కూడా ప్రారంభం కాలేదు. ప్రజలను మభ్యపెట్టేందుకే తప్ప చిత్తశుద్ధితో అభివృద్ధి చేసేందుకు కాదని అన్ని గాలిమాటలే అంటూ ప్రజలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

రేపు రాజమహేంద్రవరంలో వైఎస్ షర్మిళ సభ

- కాంగ్రెస్ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27: రాజమహేంద్రవరంలో ఈనెల 29వ తేదీ సాయంత్రం 6గంటలకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి సభ ఉందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు తెలిపారు. పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ షర్మిళారెడ్డి రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామం మీదుగా జిల్లాలోకి ప్రవేశిస్తారన్నారు. మల్లయ్యపేట, సీతంపేట, ఆర్యాంపురం నల్లచానల్ త్రీటౌన్ మీదుగా ర్యాలీగా కోటగుమ్మం వద్దకు చేరుకుని అక్కడ బహిరంగ సభకు హాజరవుతారని, అటుపై కోటిపల్లి బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. ఆయా సభల్లో కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీలు, మేనిఫెస్టోలో అంశాలపై షర్మిళారెడ్డి మాట్లాడాతారని, కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పిలుపునిచ్చారన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లు రద్దుచేస్తామంటున్నారన్నారు. అలాగు రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు బోడా వెంకట్, బాలేపల్లి మురళీధరావు, అరిగెల అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోలవరానికి రూ.7 కోట్లతో సరిపెట్టారు

ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27: కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.13 వేల కోట్లు విడుదల చేస్తుందని పోలవరం నిర్వాసితులు ఎదురుచూసారని, అయితే రూ.7 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకుందని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారులు అయినాపురపు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభలో వైసీపీ మద్దతుతో ప్రతి బిల్లు పాస్ చేయించుకున్న కేంద్రం రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ కేంద్రం ఇచ్చే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి అదనంగా రూ.3లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క నిర్వాసిత కుటుంబానికి రూ.10లక్షలు చొప్పున ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చే విధంగా జీవో విడుదల చేసినప్పటికీ ఒక్కరికి కూడా ఈ మేరకు రూ.10లక్షల ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. వైఎస్ఆర్ సీఎంగా ఉండగా తక్కువ నష్టపరిహారం పొందిన రైతులకు ఎకరానికి రూ.5 లక్షలు ఇస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదన్నారు. భూమిలేని ఎస్సీఎస్టీ నిర్వాసితులకు ఒక్కొక్కరికి కనీసం ఎకరం భూమి ఇవ్వాలని కొత్త భూసేకరణ చట్టం చెబుతున్నప్పటికీ ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకోలేదన్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ కులస్తులకు డి.ఫారం పట్టా భూములు ఇళ్ల స్థలాలకు సేకరించి వారిని భూమిలేని పేదలుగా మార్చారన్నారు. జిల్లా కలెక్టర్, భూసేకరణ అధికారులు కొత్త భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించి నేరానికి పాల్పడ్డారన్నారు. పంచాయితీరాజ్ చట్టం ప్రకారం ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీలలో గ్రామ సభలు జరపాలని కానీ ప్రభుత్వం నిర్వహించలేదన్నారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిందన్నారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అనపర్తి, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని విధుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్ కుమారి అన్నారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిని ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును, ఆసుపత్రిలోని మందుల నిల్వలను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

నేడే ఏపీ సెట్

రాజమహేంద్రవరం రీజియన్‌లో 11 పరీక్షా కేంద్రాలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష (ఏపీసెట్)పరీక్ష ఆదివారం రాజమహేంద్రవ రం రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో ఆదివారం జరుగుతుందని ఏపీ సెట్ రాజమహేంద్రవరం రీజనల్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. రాజమహేంద్రవరంలోని శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి మహిళాకళాశాల, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల, ఆదిత్య మహిళా కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోబాటు, పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల, గైట్ కళాశాల, తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ కళాశాల, సూరంపాలెంలోని ఆదిత్య ఫార్మశీ కళాశాలలతోబాటు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ 11 కేంద్రాల్లో 7వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి పరిశీలకులను నియమించామ న్నారు. అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ ఆదివారం ఉదయం 8.30 నిమిషాలకే పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలన్నారు. పరీక్ష ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30వరకూ జరుగుతుందని శ్రీనివాసరావు చెప్పారు.

సమస్యలపై నిలదీయండి

గోకవరం, ఏప్రిల్ 27: ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వస్తున్న పలు పార్టీ నాయకులను పరిష్కారం కాని తమ సమస్యలపై నిలదీయాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర రంపయర్రంపాలెం చేరుకొంది.

కావలెను
భద్రాచలం, చర్ల నందు గల మా గెస్ట్ హౌస్ నందు ఇంటి పని, వంట పని చేయుటకు ఏ బాదరాబందీ లేని ఆడమనిషి కావలెను. వయస్సు: 40-55 సం॥, ఆకర్షణీయమైన జీతం+వసతి+భోజనం.
సంప్ర: 99599 23161